
పందెం కోళ్లు రె'ఢీ'



- ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో పుంజులకు డిమాండ్
- పెంపకానికి ప్రత్యేక ఏర్పాట్లతో కేంద్రాలు
- అశ్వారావుపేట పరిసరాల్లో 100కు పైగా కోళ్ల ఫారాలు
- పందెం కోళ్లకు పెరుగుతున్న క్రేజ్
- కుటీర పరిశ్రమగా ఎదుగుతున్న వైనం

7

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఖమ్మం
5
శుక్రవారం, 27 డిసెంబరు 2024



కూలీలతో ముచ్చటిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సంక్రాంతికి తొలివిడత 'ఇందిరమ్మ' ఇళ్లు

- ఒక్కో నియోజకవర్గానికి 3500 కేటాయింపు
- ప్రతి లబ్ధిదారుడికి నాలుగు విడతల్లో రూ.5 లక్షలు
- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ అందిస్తాం : మంత్రి పొంగులేటి

6



ఆశా వర్కర్ల సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

'ఆశా' వర్కర్ల సమస్యలపై నిర్లక్ష్యం

- సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలి
- రూ.18వేల వేతనం అమలు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- సమస్యలు పరిష్కరించకుంటే అసెంబ్లీ ముట్టడి: పి.జయలక్ష్మి

6

జోష్‌లో కాంగ్రెస్... కోలుకోని బీఆర్ఎస్...

- బలోపేతం కోసం కమ్యూనిస్టుల శ్రమ
- ఎంపీ ఎన్నికల్లో పట్టు చాటుకున్న బీజేపీ
- సభ్యత్వ నమోదుతో ఉనికి చూపిన టీడీపీ
- ముగ్గురు మంత్రులది ఎవరి దారి వారిదే..
- నామినేటెడ్ పదవులు భర్తీ కాక కేడర్‌లో అసంతృప్తి
- ఉమ్మడి జిల్లా రాజకీయ సమీకరణాలను మార్చివేసిన 2024



6

2024 కాలచక్రం

ఉమ్మడి ఖమ్మం జిల్లా... 2024 సంవత్సరంలో రాజకీయంగా అనేక మార్పులకు వేదికగా నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లోనూ జోరును చూపి జోష్‌ను నింపింది. ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎంపీ ఎన్నికల్లోనూ పూర్తిగా డీలాపడింది. వరుస ఓటముల నుంచి కోలుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఇక కమ్యూనిస్టుపార్టీలు గత వైభవం కోసం తాపత్రయపడుతూ కార్యక్రమాలు సాగించగా, బీజేపీ గతం కంటే ఓట్ల బలాన్ని పెంచుకొని అందరినీ ఆశ్చర్యపరిచింది. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా టీడీపీ సభ్యత్వ నమోదుతో తనదైన అస్తిత్వాన్ని ప్రకటించుకుంది. ఇక జనసేన కూడా నిర్మాణం కోసం ప్రయత్నాలు కొనసాగించింది. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీలుగా రామసహాయం రఘురాంరెడ్డి(ఖమ్మం), బలరాంనాయక్ (మహబూబాబాద్) విజయం సాధించి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. రఘురాంరెడ్డి రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే ఎంపీ కావడం విశేషం. 2024 రాజకీయమంతా అధికార కాంగ్రెస్ చుట్టే తిరిగింది. ఇక ఖమ్మం జిల్లా నుంచి కేబినెట్‌లో భట్టి, తుమ్మల, పొంగులేటి ప్రాతినిథ్యం వహిస్తుండగా... ముగ్గురి మధ్య సమన్వయ లోపంతో పాటు ఎవరికి వారే అన్నట్టుగా వ్యవహరిస్తుండటంతో కేడర్‌లో అసంతృప్తి కనిపిస్తోంది. నామినేటెడ్ పదవుల భర్తీ కాకపోవడానికి కూడా వారి తీరే కారణమనే విమర్శలున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం



ఆవిర్భావ సభలో ఐక్యత చూపుతూ అభివాదం చేస్తున్న నేతలు



కార్మికులు, పేదల సంక్షేమమే లక్ష్యం

- కార్పొరేట్ శక్తులతో అంటకాగుతున్న కాంగ్రెస్
- దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్న బీజేపీ
- కమ్యూనిస్టు పార్టీ 99 ఏళ్ల ప్రస్థానం విశిష్టమైనది
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని
- నగరంలో సీపీఐ శత వసంతాల ప్రారంభ సభ
- ఆకట్టుకున్న ఎర్ర కవాతు, భారీ ప్రదర్శన

ఖమ్మం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పదవులు కాదు, పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. వందేళ్లుగా కార్మికులు, పేదల కోసం పోరాడుతున్నది కేవలం సీపీఐ మాత్రమేనన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందో ఏడాదిలో అడుగు పెడుతున్న సందర్భంగా గురువారం ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో సీపీఐ ఆవిర్భావ సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ 99ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాలు చేసి, విజయాలు సాధించిందన్నారు. కమ్యూనిస్టు పార్టీ, ఆర్ఎస్ఎస్ ఒకేసారి ఆవిర్భవించినప్పటికీ ఆర్ఎస్ఎస్ దేశ విచ్ఛిన్నాన్ని కోరుకుంటే, కమ్యూనిస్టులు పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతిని కోరుకున్నారన్నారు. కాంగ్రెస్ కార్పొరేట్ శక్తులతో అంటకాగిందన్నారు. బీజేపీ మతం పేరుతో దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నదని విమర్శించారు.

కమ్యూనిసులు లేకుండా తమ సమస్యలు తీరవని ప్రజలు గుర్తించారన్నారు. కమ్యూనిస్టులు దేనికి భయపడవద్దని, కమ్యూనిస్టు భావజాలంతో నిబద్ధతగా ఉంటే మన రాజ్యం వస్తుందని కూనంనేని పేర్కొన్నారు. దేశ కమ్యూనిస్టు చరిత్రలో ఖమ్మంజిల్లాకు ఒక ప్రత్యేక స్థానం ఉందని, వందలాదిమంది కమ్యూనిస్టు యోధులు ప్రజల కోసం తమ ప్రాణాలను త్యాగం చేశారన్నారు. వారి త్యాగాలకు వారసులుగా ఉన్నందుకు గర్వపడుతున్నామని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా వందేళ్ల వేడుకల్లో పాల్గొనటం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు (మిగతా 6వ పేజీలో)



నగరంలో ర్యాలీ దృశ్యం

ఖమ్మంలో సీపీఐ శతవసంతాల ప్రారంభ సభలో నృత్యం చేస్తున్న మహిళ

'డైట్'లో రూ.8.62 కోట్లతో అభివృద్ధి పనులు



నేడు మంత్రి తుమ్మల శంకుస్థాపన

ఖమ్మం ఖానాపురం హవేలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఖమ్మంలోని టేకులపల్లిలోని డైట్ కళాశాలకు మహర్దశ పట్టనుంది. వివిధ అభివృద్ధి పనులకు రూ.8.62 కోట్లు నిధులు మంజూరు కాగా, శుక్రవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేయనున్నారు. డైట్ కళాశాల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అప్‌గ్రేడ్ కావడంతో అదనపు తరగతి గదులు, లైబ్రరీ రూమ్ 1, కంప్యూటర్ రూమ్ 1, సెమినార్ హాల్, ల్యాబ్‌లు 2, స్పెషల్ ఎడ్యుకేషన్ యూనిట్ 1, రీసెర్చ్ అండ్ ఎన్నొవేషన్ సెంటర్ 1, ప్రహరీ, ప్రస్తుతం ఉన్న డైట్ కళాశాలకు మరమ్మతులు చేపట్టనున్నారు. అదేవిధంగా మరుగుదొడ్ల నిర్మాణం, ఉన్న వాటికి మరమ్మతులు చేపట్టనున్నారు. మంచినీరు, పార్కింగ్ సౌకర్యం, క్యాంటిన్ తదితర సౌకర్యాలు కల్పించనున్నారు. రాష్ట్రంలోని రెండు కళాశాలలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హోదా లభించగా అందులో ఖమ్మం నగరంలోని డైట్ కళాశాల ఒకటి. ఈ విద్యాసంస్థ అభివృద్ధిలో తుమ్మల పాత్ర కీలకం.

నేటినుంచి సీఎం కప్
రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

7

ధాన్యం అమ్మిన రైతులే
డబ్బులివ్వాలట

- తూకంలో తేడా పేరుతో మిల్లర్ల కొర్రీలు
- ధాన్యం డబ్బుల చెల్లింపునకు లంకె
- మిల్లర్ల తీరుతో అన్నదాతల ఇబ్బందులు
- నారాయణపురం సొసైటీ ద్వారా మిల్లులకు రెండు లారీల ధాన్యం

7

నెరవేరనున్న
10 గ్రామాల కల

- లింగాలలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం మంజూరు

8



పోలీస్‌స్టేషన్ వద్ద ముగ్గురు బాధితులు

పట్టపగలే దొంగల చేతివాటం

- చేతి సంచులు కత్తిరించి నగదు, బంగారు ఆభరణాల చోరీ
- వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో కలకలం
- లబోదిబోమన్న బాధితులు

వైరా, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం దొంగలు చెలరేగిపోయారు. పట్టపగలే ముగ్గురు ప్రయాణికుల చేతిసంచులు కత్తిరించి రూ.60వేల నగదు, బంగారు ఆభరణాలు తస్కరించారు. బస్టాండ్‌లో దొంగలు హల్‌చల్ చేయడంతో ప్రయాణికులు భీతిల్లిపోతున్నారు. బస్టాండ్‌లో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయకుండా అలంకారప్రాయంగా ఉండటంతో ఇదే అదునుగా భావించిన దొంగలు యథేచ్ఛగా చేతివాటాన్ని ప్రదర్శించారు. కొణిజర్ల మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన అడపా రంగనాయకులు ఖమ్మం వైపు వెళ్లే బస్సు ఎక్కుతుండగా అతని చేతిలోని (మిగతా 7వ పేజీలో)

మున్నేరు రక్షణ గోడలకు
భూసేకరణ

- ఐదు శాఖల ఆధ్వర్యంలో సంయుక్త సర్వే
- మొత్తం 245.12 ఎకరాల సేకరణ..?



మున్నేరు పరీవాహక ప్రాంతంలో సర్వే నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మున్నేరు వరద ముంపు నివారణకు ఇరువైపులా రక్షణ గోడల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణకు గురువారం జాయింట్ సర్వేను నిర్వహించారు. నీటిపారుదల, పబ్లిక్‌హెల్త్ (మునిసిపాలిటీ ఇంజనీరింగ్), ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్‌భగీరథ, ఎన్పీడీసీఎల్ అధికారులు ఈ సర్వేలో పాల్గొన్నారు. ఈనెల 24న హైదరాబాద్‌లో భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా నీటిపారుదలశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం, పాలేరు నియోజకవర్గ ప్రజలకు వరద ముంపు నుంచి కాపాడేందుకు మున్నేరుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్వహిస్తున్న నేపథ్యంలో దీనికి అవసరమైన డిజైన్లు రూపొందించాలని ఆదేశించారు.

ఈ నేపథ్యంలో గురువారం నీటిపారుదల శాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, పబ్లిక్‌హెల్త్ ఈఈ రంజిత్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మురళీకృష్ణ, ల్యాండ్ సర్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రెండు వైపులా నిర్మించనున్న గోడలకు ఖమ్మం రూరల్ వైపు ప్రభుత్వ భూమి 70 ఎకరాలు, పట్టా భూమి 70 ఎకరాలు, మొత్తం 140 ఎకరాలు, ఖమ్మం నగరంలో ప్రభుత్వ భూమి 8.36 గుంటలు, పట్టాభూమి 99 ఎకరాలు మొత్తం 107.37 గుంటలు అవసరం ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. మొత్తంగా గోడల నిర్మాణం కోసం 250 ఎకరాల భూమి అవసరం ఉంటుందని వీటిలో 170 ఎకరాలు పట్టా భూమి ఉంటుందని తేల్చారు. ఈ నివేదికలను ఆర్డీవో ద్వారా కలెక్టరేట్‌లోని ల్యాండ్ ఎక్విటేషన్ విభాగం ద్వారా ప్రభుత్వానికి నివేదించనున్నట్టు సమాచారం.

వర్షాకాలంలో మున్నేరు వరదల నుంచి ఖమ్మం నగరవాసులకు రక్షణ కల్పించేందుకు వరద రక్షణ గోడల నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం వీటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత రెండేళ్లు మున్నేరుకు గతంలో ఎన్నడూ లేని విధంగా వరదలు వచ్చి ఖమ్మం నగరంలో పలు కాలనీలతో పాటు రూరల్ మండలంలోని గ్రామాలను వరదనీటితో ముంచెత్తింది. మున్నేరు పరీవాహక ప్రాంతాలను కాపాడే లక్ష్యంతో రక్షణ గోడలను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులను కేటాయించిన విషయం విదితమే.

జోష్‌లో కాంగ్రెస్... కోలుకోని బీఆర్ఎస్...


లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి

- బలోపేతం కోసం కమ్యూనిస్టుల శ్రమ
- ఎంపీ ఎన్నికల్లో పట్టు చాటుకున్న బీజేపీ
- సభ్యత్వ నమోదుతో ఉనికి చూపుతున్న టీడీపీ
- రాజకీయ సమీకరణాలను మార్చివేసిన 2024



ఖమ్మం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): 2024 అధికార కాంగ్రెస్‌లో లోక్‌సభ ఎన్నికల్లో భారీ ఆధిక్యత జోష్‌నింపగా ప్రతిపక్ష బీఆర్ఎస్ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల వరుస ఓటమిలనుంచి ఇంకా కోలుకోలేని పరిస్థితి కనిపిస్తోంది. గత వైభవం కోసం కమ్యూనిస్టుపార్టీలు తాపత్రయపడుతూ కార్యక్రమాలు సాగించగా, గతంకంటే ఓట్ల బలాన్ని పెంచుకున్న బీజేపీ దాని మిత్రపక్షం టీడీపీ, జనసేన కూటమిలో రాబోయే కొత్తఏడాది స్థానిక సంస్థల ఎన్నికలపై గురిపెట్టి కార్యక్రమాలు సాగిస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో ఉమ్మడి ఖమ్మంజిల్లా రాజకీయ చైతన్యంతోపాటు అన్ని పార్టీల్లోనూ చక్రం తిప్పే ముఖ్యనేతలు ఉమ్మడి జిల్లాలో ఉండడంతో జిల్లా రాజకీయాలకు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది.

కాంగ్రెస్‌లో జోష్...

ఉమ్మడిజిల్లాలో గతేడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికల్లో పదింటిల్లో 9స్థానాలను భారీ ఆధిక్యతతో గెలిచి హస్తం హవాచూపింది. భద్రాచలం నుంచి బీఆర్ఎస్ నుంచి గెలిచిన తెల్లం వెంకటరావు కూడా ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ గూటికి చేరడంతో జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేల బలం పదికి చేరింది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఇటు ఖమ్మం, అటు మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల నుంచి కాంగ్రెస్ తరపున పోటీచేసిన రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాంనాయక్‌లు ఇద్దరు భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికల కంటే అధిక ఓట్లు కాంగ్రెస్ సాధించి జిల్లాలో సత్తా చూపింది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో 7,66,929 ఓట్లు రఘురాంరెడ్డి సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు 7,33,293 ఓట్లు రాగా.. ఈసారి 33,636ఓట్లు అధికంగా లభించాయి. ఖమ్మంలో 4లక్షల67వేల ఓట్ల ఆధిక్యతతో కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయం సాధించారు.

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఓటుబ్యాంకును లక్షకు పైగా బీజేపీ చీల్చడంతో కాంగ్రెస్ ఆధిక్యతకు అవకాశం లభించింది. ఖమ్మంలో కాంగ్రెస్ నుంచి రఘురాంరెడ్డి, మహబూబాబాద్‌లో పోరిక బలరాంనాయక్ గెలుపుకోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఖమ్మం, కొత్తగూడెంలో ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లోక్‌సభ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ నుంచి లోక్‌సభ ఎన్నికలకు ముందే కేంద్రమాజీ మంత్రి రేణుకాచౌదరి రాజ్యసభకు ఎన్నికకాగా బీఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా వద్దిరాజు రవిచంద్ర రెండోసారి ఎన్నికయ్యారు.

ఎమ్మెల్సీ పట్టభద్రుల స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా చింతపండు నవీన్‌కుమార్(తీన్మార్ మల్లన్న)విజయం సాధించారు. దీంతోపాటు ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా రాయల నాగేశ్వరరావు, నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర అటవీ సంస్థ చైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, రాష్ట్ర హస్తకళా అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నాయుడు సత్యం నియమితులయ్యారు. ఉమ్మడి జిల్లాకు నాలుగు కార్పొరేషన్ చైర్మన్ పదవులు లభించాయి బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉన్న ఖమ్మం డీసీసీబీ చైర్మన్ పదవిని కాంగ్రెస్ సొంతం చేసుకుంది. అవిశ్వాసం ద్వారా కూరాకుల నాగభూషయ్యను తొలగించి వైస్‌చైర్మన్‌గా ఉన్న దొండపాటి వెంకటేశ్వరరావును చైర్మన్‌గా నియమించారు. డీసీఎంఎస్ చైర్మన్ పదవిలో ఉన్న రాయలశేషగిరిరావుకు న్యాయపరంగా ఆ పదవి కోల్పోవడంతో వైస్‌చైర్మన్‌గా ఉన్న కొత్వాల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ రెండు పదవులు కాంగ్రెస్ చెంతకు చేరాయి. అలాగే లోక్‌సభ ఎన్నికలకు ముందే ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజతో పాటు పలువురు కార్పొరేటర్లు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ గూటికి చేరారు. ఉపముఖ్యమంత్రి భట్టితోపాటు వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు జిల్లానుంచి ప్రాతినిధ్యం వహిస్తుండగా.. ముగ్గురి మధ్య సమన్వయం లోపం, ఎవరిదారిన వారు ఉండడంతో కాంగ్రెస్ కేడర్‌లో అసంతృప్తి కనిపిస్తోంది. మంత్రులు ఉమ్మడిగా పర్యటించకపోవడం,అంతర్గత విబేధాలతో కేడర్ నలుగుతోంది. నామినేటెడ్ పదవులు జిల్లాలో ఇంకా నియామకం జరగాల్సి ఉన్నా.. మంత్రులు సమన్వయంగా వ్యవహరించకపోవడంతో పదవుల నియామకంపై నిర్ణయాలు జరగడంలేదు.

ఇంకా కోలుకోలేని బీఆర్ఎస్

అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూడడం, లోక్‌సభ ఎన్నికల్లో రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఓటుబ్యాంకు కోల్పోయి భారీ వ్యత్యాసంతో ఓటమిచెందడంతో బీఆర్ఎస్ పార్టీ ఇంకా కోలుకోలేని పరిస్థితిలోనే ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన ఏకైక భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ గూటిలో చేరారు. జిల్లా పరిషత్ పదవి కాలం కూడా పూర్తికావడంతో స్థానిక సంస్థల పదవులన్నీ బీఆర్ఎస్ కోల్పోయింది. అలాగే ఖమ్మం కార్పొరేషన్‌లో ఉన్న కొందరు కార్పొరేటర్లు, మేయర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావు, మహబూబాబాద్‌లో మాజీ ఎంపీ కవిత ఇద్దరు ఓటమి చెందడంతోపాటు అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓటు బలం కూడా తగ్గడం బీఆర్ఎస్ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండడంతో బీఆర్ఎస్‌కు పట్టు దొరకని పరిస్థితి. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, దీక్షాదివస్, కేసీఆర్ జన్మదినం వంటి కార్యక్రమాలకే కేడర్ పరిమితమవుతోంది. ప్రస్తుతం జిల్లా బీఆర్ఎస్‌కు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఉమ్మడిజిల్లాకు పెద్దదిక్కుగా ఉన్నారు.

కొత్త ఆశలతో టీడీపీ, బీజేపీ కూటమి

ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ, టీడీపీ చెరో దారిలో పయనించినా లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమిగా జిల్లాలో ఉనికి చాటాయి. ఆంధ్రాలో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభావం ఈ ఏడాది జిల్లాపై పడింది. లోక్‌సభ ఎన్నికల్లో టీడీపీ బీజేపీకి మద్దతు ఇచ్చింది. ఫలితంగా అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 16వేల976 ఓట్లు తెచ్చుకున్న బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో లక్షా18 వేల వరకు ఓట్లు తెచ్చుకుంది. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు పలువురు ప్రచారం నిర్వహించారు.ఖమ్మం నుంచి బీజేపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావు, మహబూబాబాద్ నుంచి మాజీ ఎంపీ సీతారాంనాయక్‌లు పోటీచేశారు. గతంకంటే అధికంగా ఓటు బ్యాంకు సాధించడంతో టీడీపీ, బీజేపీ, జనసేనకూటమి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించాయి.

పట్టుకోసం కమ్యూనిస్టులు...

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీపీఎం, సీపీఐతోపాటు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీలు తమ వంతు కార్యక్రమాలు సాగిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో దారుణంగా దెబ్బతిన్న సీపీఎం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చి ఆ పార్టీతో జతకట్టింది. రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న తమ్మినేని వీరభద్రం పాలేరు నుంచి పరాజయం చెందిన విషయం విదితమే. పార్టీని బలోపేతం చేసేందుకు సీపీఎం ఇటీవల నియోజకవర్గాల స్థాయి సమావేశాలతో పాటు జిల్లా మహాసభలు కూడా నిర్వహించింది. సత్తుపల్లిలో మూడురోజులపాటు నిర్వహించిన మహాసభల్లో మూడోసారి జిల్లా కార్యదర్శిగా నున్నా నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. భద్రాద్రి జిల్లా కార్యదర్శిగా మచ్చా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. కాంగ్రెస్‌కు మిత్రపక్షంగా ఉన్న సీపీఐ ఆందోళనలు సాగిస్తూనే కాంగ్రెస్‌తో కలిసి ప్రయాణం చేస్తోంది. అటు సింగరేణి కార్మిక వర్గం సమస్యలపైనా గళమెత్తుతూ రైతు, కార్మిక సమస్యలపైనా ఆందోళనలు సాగిస్తోంది. జిల్లాలో పూర్వవైభవం సాధించాలన్న లక్ష్యంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కొత్తగూడెం ఎమ్మెల్యేగా ఉమ్మడిజిల్లాను పార్టీపరంగా మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేడర్‌కి దశదిశ నిర్దేశిస్తూ కార్యక్రమాలు సాగిస్తున్నారు. సీపీఐ వందో ఆవిర్భావ వేడుకలు ఖమ్మంలో భారీర్యాలీ నిర్వహించి పట్టు చూపింది. సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆవిర్భవించిన తర్వాత పలు ఎర్రజెండా జాతీయ పార్టీలతో ఐక్యతగా ఖమ్మంలో రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు సారథ్యంలో ఈ ఏడాది మూడు రోజులపాటు జాతీయ ప్రతినిధుల సభలు నిర్వహించారు.


లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో కేసీఆర్


సత్తుపల్లిలో ఇటీవల సీపీఎం ప్రదర్శన



లోక్‌సభ ప్రచారంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా


టీడీపీ మే 28న ఎన్టీఆర్ 101వ జయంతి వేడుకలు

భద్రాద్రి

- రామాలయానికి పెరిగిన భక్తుల రద్దీ
- స్వామిని దర్శించుకున్న ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్

భద్రాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. గత మూడు రోజులుగా క్రిస్మస్ సెలవులు ఉండటంతో భద్రాద్రికి భక్తుల తాకిడి పెరిగింది. పట్టణంలోని దేవస్థానం కాటేజీలు సత్రాలు, ప్రైవేటు లాడ్జీలు సైతం భక్తులతో నిండిపోయాయి. పాపికొండలకు సైతం అధిక సంఖ్యలో పర్యాటకులు వెళ్తున్నారు. అలాగే ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు క్యూలైన్లలో భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు.

భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారిని ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ముక్తా శ్రీనివాసులు-డాక్టర్ సీహెచ్ భవానీ దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ముందుగా ఆయన అంతరాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, అర్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణంలో పాల్గొని పర్ణశాల ఆలయాన్ని సైతం దర్శించుకున్నారు.

ఆదివాసీలకు కాంగ్రెస్ అండ

- రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య



భద్రాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య అన్నారు. భద్రాచలంలో గురువారం జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం 50 వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. 1974లో స్థాపించిన ఈ సంఘంలో నేను కూడా సభ్యుడిగానే ఉండి ఎమ్మెల్యే అయ్యానని గుర్తుచేశారు. అధికారంలో ఉన్నా.. లేకున్నా ఆదివాసీల సంక్షేమ, అభివృద్ధి ఫలాల కోసం నిరంతరం పనిచేస్తూనే ఉంటామని పేర్కొన్నారు. సంఘం కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేస్తానని పేర్కొన్నారు. గిరిజన చట్టాలను ఏజెన్సీ ప్రాంతాల్లో పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌదరి లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్, చిడెం జంగు, మోకాళ్ల శ్రీనివాసరావు, ఆరెం పాపారావు పాల్గొన్నారు.

'ఆశా' వర్కర్ల సమస్యలపై నిర్లక్ష్యం

- సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలి
- రూ.18వేల వేతనం అమలు చేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం


నగరంలో ఆశ వర్కర్ల ప్రదర్శన దృశ్యం

ఖమ్మం టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆశావర్కర్ల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనాన్ని, ఇతర సౌకర్యాలను కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ తెలంగాణా ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న బస్‌జాతా గురువారం ఖమ్మం చేరుకుంది. ఈ బస్‌జాతాకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సంఘీభావం తెలిపారు. అనంతరం, పెవిలియన్ గ్రౌండ్‌నుంచి మంచికంటి భవన్ వరకు జరిగిన ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంచికంటి భవన్‌లో జరిగిన ఆశావర్కర్ల సమావేశంలో తమ్మినేని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే వారి వేతనాలను పెంచటంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీలు ఇచ్చారని, ఈ విషయాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో సైతం పొందుపర్చారన్నారు. దీనిని నమ్మి ఆశావర్కర్లు కాంగ్రెస్ విజయంలో కీలకపాత్ర వహించారని, అధికారంలోకి వచ్చిన తరువాత హామీని తుంగలో తొక్కారన్నారు. ఆశాల వేతనం రూ.18వేలుగా నిర్ణయం చేయాలని ఎమ్మెల్యేలకు, మంత్రులకు విజ్ఞప్తులు చేసినా.. వారు పట్టించుకోలేదన్నారు. దీంతో ఈనెల 15వ తేదీ నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్‌జాతా నిర్వహించాలని యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందన్నారు.

బస్‌జాతా బృంద నిర్వాహకురాలు, ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ 2013లో జరిగిన 45వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌లో స్కీం వర్కర్స్‌లో భాగమైన ఆశా వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, వారికి కనీస వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ అమలుచేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని తీర్మానం చేశారన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఆశాలకు రూ.3వేలు మాత్రమే నెలకు పారితోషికం చెల్లించటం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిని బట్టి వేతనాన్ని ఇస్తామని చెప్పటంతో వారు నెలకు రూ.9990 మాత్రమే పొందగలుగుతున్నారన్నారు. వేతన సమస్య, ఇతర సౌకర్యాల సమస్యలను పరిష్కరించకుంటే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జే వెంకటేష్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మా విష్ణువర్ధన్, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జే మంగమ్మ, శ్రామిక మహిళా నాయకురాలు పీ రమ్య, సీఐటీయూ జిల్లా నాయకులు వై విక్రం, ఆశావర్కర్ల నాయకులు పాల్గొన్నారు.

సంక్రాంతికి తొలివిడత 'ఇందిరమ్మ' ఇళ్లు

- రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


పంచాయతీ భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి

దమ్మపేట/ములకలపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 80లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో గురువారం ఇందిరమ్మ మోడల్ గృహానికి మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినానికి తొలి విడతగా 4.50లక్షల ఇళ్లను మంజూరు చేయటం జరుగుతుందన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన పేదలకు తొలి విడతగా ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయటం జరుగుతుందని, నాలుగేళ్ల పాటు ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రతి లబ్ధిదారుడికి నాలుగు విడతల్లో రూ.5లక్షలు చెల్లించటం జరుగుతుందన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ అశ్వారావుపేట నియోజకవర్గం గిరిజనులు అధికంగా ఉన్న ప్రాంతమని అందువల్ల అదనంగా ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలని కోరారు. అంతకు ముందు నాచారం, గన్నేపల్లి గ్రామాల్లో రూ.20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాలను ఎమ్మెల్యే జారేతో కలిసి మంత్రి ప్రారంభించారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని మంత్రి పొంగులేటి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఇటీవల జరిగిన రిజిస్ట్రేషన్లు, పార్టీషన్ దరఖాస్తులను పరిశీలించి దరఖాస్తుదారులకు నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. సక్రమంగా పనులు చేస్తున్నారా.. డబ్బులు అడుగుతున్నారా అని ఆరా తీశారు. కార్యాలయంపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమాలు జరిగితే చర్యలు తప్పవని రెవెన్యూ అధికారులను హెచ్చరించారు. మంత్రి వెంట ఎంపీ రఘురాంరెడ్డి, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు పాల్గొన్నారు.

అశ్వారావుపేటకు అదనంగా ఇళ్లు

రాష్ట్రంలో పేదలకు సంక్రాంతి కానుకగా మొదటి విడతలో 4. 50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్టు మంత్రి పొంగులేటి ప్రకటించారు. గురువారం ములకలపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. సంజీవ్‌నగర్, వీకే రామవరం గ్రామాల మధ్య హైలెవల్ వంతెన నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అభ్యర్థనమేరకు అశ్వారావుపేట నియోజకవర్గానికి అదనంగా మరికొన్ని ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడానికి ఆలోచన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, అశ్వారావుపేట ఎమ్మెల్యే ఆదినారాయణ, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అంజి, డీసీసీబీ ఉపాధ్యక్షుడు బ్రహ్మయ్య, నాగళ్ల వెంకటేశ్వరరావు, నర్సింహారావు, శనగపాటి రవి, పాలకుర్తి రత్న భూషణం, అశ్వారావుపేట నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుంపుల రవితేజ, పాలకుర్తి, రవి, మరీదు నాగు తదితరులు పాల్గొన్నారు.

నేనెవరో తెలుసా?

అశ్వారావుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మండలంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటన సందర్భంగా ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. గురువారం కేశప్పగూడెం సమీపంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ములకలపల్లి వెళుతుండగా మార్గంమధ్యలో వేరుశెనగ చేలో పనిచేస్తున్న కూలీలను చూసి వాహనం దిగి వారి దగ్గరకు వెళ్లారు. 'అక్కలారా.. చెల్లెమ్మలారా బాగున్నారా... మీకు సొంత ఇళ్లు ఉన్నాయా..' అంటూ పలకరించారు. 'ఇంతకీ నేనెవరో తెలుసా? మీ ఇంట్లో వాచీలో బొమ్మ ఉంటుంది గుర్తు పట్టారా...?' అంటూ కూలీలను పలకరించారు. ఇందుకు వారు స్పందిస్తూ 'తెలుసు, మీరు మంత్రి శ్రీనన్న..' అని బదులిచ్చారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ 'గాజులు వేయించుకోండి...' అంటూ వారికి కొంత నగదు ఇచ్చి ముందుకు కదిలారు. దారిలో కూలీలున్న మరో చోట ఆగి 'అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం.. అందరూ సద్వినియోగం చేసుకోవాలి..' అని సూచించారు. మంత్రి వెంట ఎంపీ రఘురాంరెడ్డి, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐడీసీ చైర్మన్ విజయబాబు తదితరులు ఉన్నారు.

'కిక్కు' తగ్గింది



- స్టేట్ బోర్డర్‌లో భారీగా పడిపోయిన మద్యం అమ్మకాలు
- గత ఏడాదితో పోల్చితే డిసెంబరు నెలలో 59శాతం తగ్గిన విక్రయాలు

మధిర, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బోర్డర్ ప్రాంతం అయిన మధిరలో ఈ యేడాది డిసెంబరులో మద్యం అమ్మకాలు దారుణంగా పడిపోయాయి. మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిఅయిన మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాల్లో 20మద్యం దుకాణాలు ఉండగా ఎక్కువగా ఆంధ్రా బోర్డర్ కావడంతోపాటు నిర్వాహకులు కూగా ఆంధ్రా వారే ఉన్నారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ యేడాది 59శాతం మద్యం విక్రయాలు తగ్గాయి. మధిర ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గత ఏడాది డిసెంబరు 2023లో 20.49కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇది జిల్లాలోనే రెండో స్థానంలో నిల్చింది. అలాంటిది ఈ యేడాది డిసెంబరులో ఇప్పటివరకు 8.45 కోట్ల వ్యాపారం మాత్రమే జరిగినట్లు ఎక్సైజ్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గత యేడాది డిసెంబరులో ఐఎంఎల్ 28,419 కేసులు, బీర్లు 10,340 కేసులు అమ్మగా, ఈ యేడాది డిసెంబరులో ఈరోజు వరకు ఐఎంఎల్ 12,449కేసులు (56శాతం తగ్గింది), బీర్లు 4.078 కేసులు (61శాతం తగ్గింది) మాత్రమే అమ్ముడుపోయాయి. మొత్తంగా గత యేడాది డిసెంబరుతో పోల్చితే ఈ యేడాది డిసెంబరులో 59శాతం మద్యం విక్రయాలు తగ్గినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గత ఏడాది ఎన్నికలతోపాటు ఏపీలో మద్యం నాణ్యత లేకపోవడం, అన్ని రకాల మద్యం కంపెనీలు అందుబాటులో లేకపోవడంతో పాటు అధిక ధరలు వెరసి బోర్డర్ అవతల ఉన్న ఏపీ ప్రజలు ఎక్కువగా తెలంగాణ మద్యం తాగేవారు.

తెలంగాణ మద్యాన్ని ఏపీ ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. తెలంగాణ బీర్‌కు మంచి డిమాండ్ ఉంది. ఏపీలో ప్రభుత్వం మారడం అక్కడ మద్యం విధానం మారడంతో ధరలు బాగా తగ్గించారు. అన్ని కంపెనీలు అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో ఏపీ నుంచి మందుబాబులు రాక గణనీయంగా తగ్గింది. దీనికితోడు వాతావరణం కూడా మద్యం అమ్మకాలపై పడింది.

ఈ యేడాది వాతావరణంలో చలి ఉండటం, వేసవిలోనూ తుఫాన్ ప్రభావం, మంచు కురుస్తున్న పరిస్థితులతో మద్యం విక్రమాలు తగ్గాయనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. రెండు సంవత్సరాల క్రితం మధిర మద్యం విక్రయాల్లో జిల్లాలో రెండో స్థానంలో నిలవగా ఈసారి చివరి స్థానంకు పడిపోయింది. బోర్డర్ జిల్లాలోనే ఈపరిస్థితి ఉంది. గతంలో మద్యం అమ్మకాల్లో రాష్ట్రంలోనే అగ్రభాగాన ఉన్న ఖమ్మం జిల్లా ఈ యేడాది 28 స్థానానికి పడిపోయినట్లు సమాచారం.

కార్మికులు, పేదల సంక్షేమమే లక్ష్యం




సీపీఐ కార్యకర్తల కవాతు

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతూ కమ్యూనిస్టుల పోరాటాలు చారిత్రాత్మకమని, సర్వం త్యాగాలమయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలకోసం పోరాడుతున్న కమ్యూనిస్టులపై అనేక కుట్ర కేసులను పెట్టిందని, వేలాదిమంది జైలు జీవితం గడిపారన్నారు. ఉద్యమ సమయంలో జిల్లా ఉద్యమ దిక్సూచిగా పనిచేసిందని పువ్వాడ పేర్కొన్నారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు చరిత్రలో పోరాటాల పురిటిగడ్డగా ఖమ్మం ఖ్యాతి గడించిందన్నారు. చారిత్రక భూపోరాటాలకు సాక్ష్యంగా నిలిచిందన్నారు. సభకు ముందు జెడ్పీసెంటర్ నుంచి భక్తరామదాసు కళాక్షేత్రం వరకు 100మందితో ఎర్రకవాత్, భారీ ప్రదర్శన నిర్వహించారు. సభలో తెలంగాణా సాయుధపోరాటంలో పాల్గొన్న ఆనాటి తరం వారిని సన్మానించారు. అలాగే సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, మౌలానా, డాక్టర్ గోర్కితో సహా పలువురిని సన్మానించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షత వహించిన ఆవిర్భావ సభలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కే. జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



పువ్వాడ నాగేశ్వరరావుకు జ్ఞాపిక ఇస్తున్న కూనంనేని



పడగవిప్పిన నాగుపాము

నాగరాజా..

» ఆలయంలో పాము ప్రత్యక్షం

ముదిగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముదిగొండ చెన్నకేశవర్ల స్వామి ఆలయంలో గురువారం ఓ నాగపాము ప్రత్యక్షమైంది. ఆలయంలోని మండపంలో ఉన్న విష్ణుమూర్తి విగ్రహం వద్ద నాగపాము అర్ధగంటపాటు పడగవిప్పి ఆడింది. గమనించిన పూజారి రొంపిచర్ల సత్యార్థ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నాగపామును చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి చూశారు. ఆతర్వాత నాగపాము ఆలయ ప్రాంగణంలోని పుట్టలోకి వెళ్లిపోయింది.



సంక్రాంతికి కోడి పందాలకున్న ప్రత్యేకతే వేరు. పందెపు రాయుళ్లు జాతి కోడి పుంజులను ఎంపిక చేసుకుంటారు. వాటిల్లోను సమయాన్ని బట్టి కోడి రంగు, ఇతర పరిస్థితులను అంచనా వేసుకొని పందాలు కడుతుంటారు. కోడి పందాల్లో గెలవట గర్వంగా భావిస్తుంటారు. అందుకే జాతి కోడి పుంజులను ఎంపిక చేసుకొని, వాటికి తగిన శిక్షణ, ప్రత్యేకఆహార పదార్థాలు, వ్యాయామం కూడిన శిక్షణ ఇస్తుంటారు.

పందెం కోళ్లు.. 'రెఢీ'

» ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో పుంజులకు డిమాండ్
» పెంపకానికి ప్రత్యేక ఏర్పాట్లతో కేంద్రాలు
» అశ్వారావుపేట పరిసరాల్లో 100కు పైగా కోళ్ల ఫారాలు
» పందెం కోళ్లకు పెరుగుతున్న క్రేజ్
» కుటీరపరిశ్రమగా కూడా ఎదుగుతున్న వైనం

అశ్వారావుపేట, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట, దమ్మపేట ప్రాంతాల్లో దాదాపు 100కుపైగా జాతి కోడిపుంజుల పెంపకం కేంద్రాలు ఏర్పాటయ్యాయి. 10 నుంచి 50 కోడి పుంజులను ఇళ్ల వద్దే కుటీర పరిశ్రమలా పెంచుతూ సంక్రాంతి సమయంలో వాటిని అమ్మడం ద్వారా ఉపాధిని పొందేవారి సంఖ్య వందల్లోనే ఉంటుంది. ఏపీ, తెలంగాణాతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి కూడా వచ్చి కోళ్లను కొంటుంటారు. .అశ్వారావుపేట, అల్లిగూడెం, గంగారం, రామన్నగూడెం, పండువారిగూడెం, పరిసరాల్లోను, దమ్మపేట మండలంలోని మందలపల్లి పరిసరాలలో "జాతి కోడి పుంజుల పెంపక కేంద్రాలు భారీ ఎత్తున ప్రారంభించారు. పామాయిల్, కొబ్బరి తోటల్లో బోర్లుకు దగ్గరలో ప్రత్యేక స్థలాన్ని ఎంపిక చేసుకొని పలు రకాల జాతి కోడి పుంజులను పెంచుతున్నారు. సీసీ కెమెరాల పహారాలో, పదుల సంఖ్యలో పాలేర్లను పెట్టుకొని కోడి పుంజులను పెంపకాన్ని చేపట్టారు. ఒక్కో కోడి పిల్లను రూ.10 వేల నుంచి రూ.30వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసి పందాలకు సిద్ధం చేస్తున్నారు. కనీసం 100 కోడి పుంజులను పెంచితే కోటి రూపాయలకు పైగా టర్నోవర్ జరుగుతుంది.

ఖరీదైన ఆహారం..

పుంజులకు జీడిపప్పు, బాదం పప్పు, మటన్ కీమా, రాగి సంగటి వంటి ప్రత్యేక దానాను క్రమపద్ధతిలో ఆహారంగా అందిస్తుంటారు. నీటి తొట్టెలలో రోజు 10 నుంచి 15 నిమిషాల పాటు ఈత కొట్టిస్తుంటారు. ఒళ్లంతా గట్టిపడేలా వ్యాయామం చేయిస్తుంటారు. వ్యాధులు సోకకుండా వ్యాక్సిన్‌లు, మందులను వాడుతుంటారు.

లక్షల్లో పలికే ధర

ఒక్కో కోడి పుంజును ఏడాది నుంచి ఏడాదిన్నర వరకు పెంచుతారు. ఒక్కో కోడికి రూ.25 నుంచి 40 వేల వరకు ఖర్చవుతుంది. అమ్మకం ధర లక్షల్లోనే ఉంటుంది. కేంద్రాల్లో సీసీ కెమెరాలు, విద్యుత్ దీపాలు, కోడి పుంజులకు ప్రత్యేకంగా ఫెన్సింగ్ ఏర్పాట్లు ఉంటాయి. జాతి కోడి పుంజులను, కోడి పెట్టలతో క్రాస్ చేయించి పిల్లలను పెంచుతారు. ఒక్కో జాతికోడిపైన ఒక్కో జాతి పుంజును వేస్తేనే పందెం పొడుస్తుందని నమ్ముతుంటారు. దీంతో పందెపురాయుళ్లు ఎంపిక చేసుకున్న జాతి, రంగు కోళ్లను పందానికి దింపుతారు. పుంజుల్లో డేగ, కాకి, పచ్చకాకి, సేత్రు, నెమలి, కేతు, పింగళ వంటి జాతులు ఉంటాయి.

నేటి నుంచి సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

» 31 నుంచి ఆర్చరీ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు శుక్రవారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నారు. పోటీలకు రాష్ట్రంలోని పాత పది జిల్లాల నుంచి 140 మంది బాలురు, 140 మంది బాలికలు మొత్తం 280 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. పల్లెల నుంచి ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యంగా, రాబోయే రోజుల్లో ఖచ్చితంగా ఒలింపిక్స్ పోటీల్లో తెలంగాణ నుంచి పతకాలు సాధించే క్రీడాకారులను వెలికి తీయడమే ముఖ్య ఉద్దేశ్యంగా రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ మినిస్టర్ కప్-2024ను నిర్వహిస్తుంది. ఇప్పటికే మండల, జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. ఆయా జిల్లాలకు ఎంపికైన క్రీడాకారులు డిసెంబరు 27 నుంచి జనవరి 2 వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ మేరకు ఖమ్మం జిల్లాకు వాలీబాల్, ఆర్చరీ క్రీడాంశాలలో రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించే బాధ్యతను రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అప్పగించింది.

ఈనెల 31 నుంచి రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు

సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలలో భాగంగా ఈనెల 31 నుంచి జనవరి 1 వరకు రాష్ట్రస్థాయి బాలుర, బాలికల ఆర్చరీ పోటీలను నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నారు. పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరుకానున్నారు. వీరితో పాటు టెక్నికల్ సిబ్బంది, మేనేజర్లు, కోచ్‌లు మొత్తం మరో 80 మంది పాల్గొననున్నారు.

రెండు జిల్లాల స్థాయి యోగా పోటీలు

కొణిజర్ల, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామంలో జనవరి 5న యోగా ప్రచార సమితి ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం రెండు జిల్లాల స్థాయిలో యోగా పోటీలు ఉంటాయని నిర్వాహకులు ఝాన్సీలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి1లోపు పాల్గొనే వారు పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు. పాల్గొనే వారి వయస్సు ఎనిమిది నుంచి 60ఏళ్ల లోపు ఉండవచ్చని అన్నారు. వివరాలకు ఫోన్ నెం. 81064 68801లో సంప్రదించాలని కోరారు.

క్రైం సమాచారం

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



కేశవ్(ఫైల్)

ముదిగొండ, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన ముదిగొండ మండలం ముత్తారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గొల్లమూడి కేశవ్(21) ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో పనిచేస్తున్నా డు. కేశవ్ తండ్రి కొద్దిరోజుల క్రితం మృతిచెందగా తల్లి తన అక్కతో కలిసి జీవిస్తున్నారు. గురువారం ఉదయం కేశవ్ తల్లి, అక్క క్రిస్మస్ పండుగ సందర్భంగా ఊరు వెళ్లగా కేశవ్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. ఆసమయంలో ఇంట్లో ఉరివేసుకొని చనిపోయినట్లు చుట్టు పక్కల వారు చూసి తల్లి, అక్కకు సమాచారం అందించారు. కేశవ్ మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని అక్క స్వప్న పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌హెచ్‌వో మురళీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

వైరా, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ బ్రాహ్మణపల్లిలో పేకాట స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. రూ.3,700నగదు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే దొంగల చేతివాటం



(5వ పేజీ తరువాయి)

సంచిని కత్తిరించి అందులో ఉన్న రూ.54వేల నగదును కాజేశారు. అలాగే గండగలపాడు గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు జగ్గయ్యపేట బస్సు ఎక్కుతున్న సమయంలో చేతుల్లోని సంచులను కత్తిరించి వాటిలో ఉన్న నగదు, బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బస్సులో ఎక్కిన తర్వాత టిక్కెట్లు తీసుకొనేందుకు చేతి సంచులు చూసుకోగా ఆధార్‌కార్డులు సహా నగదు, బంగారు ఆభరణాలు కన్పించకపోవడంతో బాధితులు లబోదిబోమన్నారు. ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇచ్చి వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన గురించి తెలిసిన వెంటనే వైరా, కొణిజర్ల పోలీసులు బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహించారు. అక్కడి పరిసరాలను పరిశీలించారు.

సోలార్ దీపాల అందజేత

దుమ్ముగూడెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల సిరిగుండం గొత్తికోయలకు పోలీసుశాఖ గురువారం నిత్యావసరాలు, సోలార్ దీపాలను అందజేసింది. ఆదివాసీ గిరిజనుల కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపడతామని సీఐ అశోక్ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే నిషేధిత మావోయిస్టులకు ఎటువంటి సహాయ సహకారాలు ఇవ్వొద్దని సూచించారు. ఎస్‌ఐలు వెంకటప్పయ్య, గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
» రూ.3.65 కోట్ల హైలెవెల్ వంతెన పనులకు శంకుస్థాపన
» నారంవారిగూడెం కార్యదర్శి బదిలీకి ఆదేశాలు



కేశప్పగూడెం సమీపంలో హైలెవెల్ వంతన పనులకు శంకుస్థాపన చేస్తున్న రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అశ్వారావుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. అశ్వారావుపేట మండలం కేశప్పగూడెం సమీపంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా రూ.3.65కోట్లతో నిర్మించనున్న హైలెవెల్ వంతెన పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు తమ సమస్యలను మంత్రికి ఏకరువు పెట్టారు. నారంవారిగూడెం గ్రామస్థులు మాట్లాడుతూ అక్కడి పంచాయతీ కార్యదర్శి సరిగా పనిచేయడం లేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన మంత్రి ఆ కార్యదర్శిని తక్షణమే బదిలీ చేయాలని, అవసరమైతే పాలేరు నియోజకవర్గానికి పంపాలని డీపీవో చంద్రమౌళిని ఆదేశించారు. వాగొడ్డు గ్రామస్థులు మాట్లాడుతూ తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. జేసీ మధును ఆ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కేశప్పగూడెం పరిసరాల ప్రజలు చేపల చెరువుల్లోని నీరు పెద చెరువులోకి వెళుతుండటంతో ఆ చెరువులో పెంచుతున్న చేపలు చనిపోతున్నాయని మంత్రి దృష్టికి తెచ్చారు. సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట ఎంపీ రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ విజయబాబు తదితరులు వున్నారు.

తుమ్మల వర్గం నాయకుల దూరం

గురువారం దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాలలో జరిగిన రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటనలో ఆయా మండలాలలోని మంత్రి తుమ్మల వర్గానికి చెందిన నాయకులు పలువురు దూరంగా ఉన్నారు. మండలానికి చెందిన తుమ్మల వర్గానికి చెందిన మొగళ్లపు చెన్నకేశవరావు, బండి పుల్లారావు, దమ్మపేట మండలానికి చెందిన ఆయిల్‌పామ్ రాష్ట్ర అడ్వయిజరీ కమిటీ సభ్యులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు ఎల్లిన రాఘవరావు, కెవీ సత్యనారాయణ, కొయ్యల అచుతరావు, నాగ ప్రసాద్, వసంతరావు, మన్నెం అప్పారావు, ములకలపల్లి మండలానికి చెందిన అమర్‌నాద్ తదితరులు పొంగులేటి పర్యటనకు పాల్గొనలేదు. మంత్రి పొంగులేటి పర్యటన కార్యక్రమం ముందుగా తమకు సమాచారం ఇవ్వకుండా నిర్ణయించారని, ఇది తమకు ఆవేద కలిగించిందని పేర్కొన్నారు. అందుకేపర్యటనకు హాజరుకాలేకపోయాయమని కొందరు తెలిపారు.

జాతీయ షూటింగ్ పోటీల్లో నారాయణదాసుకు కాంస్య పతకం



కల్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరుగుతున్న 67వ జాతీయ షూటింగ్ పోటీల్లో కల్లూరులోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన డీఎస్పీ దామాల నారాయణదాసుకు కాంస్యపతకం సాధించాడు. 25మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ పురుషుల విభాగంలో తన ప్రతిభను కనపర్చి కాంస్య పతకం సాధించాడు. నారాయణదాసు హైదరాబాద్‌లోని మంచిర్యాల స్పెషల్ బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. గతంలో జాతీయస్థాయిలో పలు ప్రాంతాల్లో జరిగిన పిస్టల్ షూటింగ్ పోటీల్లో తన ప్రతిభను కనపర్చి పలు పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా తాజాగా పతకం సాధించినందుకుగానూ కల్లూరు అంబేద్కర్‌నగర్‌కు చెందిన ప్రముఖులు, మిత్రులు ఉబ్బన బాబూరావు, గోపాలస్వామి, మేకల కృష్ణ తదితరులు నారాయణదాసును అభినందించారు.

మట్టి తోలకాలను అడ్డుకున్న గిరిజనులు



టిప్పర్లను అడ్డుకున్న గిరిజనులు

పెనుబల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతమైన దేవతల గుట్ట నుంచి మట్టిని తరలించొద్దని లింగగూడెం, గౌరారం గ్రామాలకు చెందిన గిరిజనులు గురువారం టిప్పర్లను అడ్డుకున్నారు. గత కొంతకాలంగా బాంబులు బ్లాస్టింగ్ చేసి మట్టిని తీసి బయటకు తరలిస్తున్నారని ఆరోపిస్తూ గిరిజనులు టిప్పర్లను అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే ఊరుకొనేది లేదని హెచ్చరించారు.

త్వరలోనే సత్తుపల్లి ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం

» రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ప్రారంభోత్సవం ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం సత్తుపల్లి పర్యటనలో భాగంగా పలు ప్రయివేట్ కార్యక్రమాలలో పాల్గొన్న ఆయన సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రహదారి కొద్ది నిమిషాలు ఆగివెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన ఉండగా పెనుబల్లి, కల్లూరు, తల్లాడ మండలాలలో ప్రభుత్వ కార్యక్రమాలు ఉన్న నేపథ్యంలో ఆయన ఆగకుండా వెళ్లిపోయారు. త్వరలో ఆసుపత్రి ప్రారంభోత్సవం ఉంటుందని చెబుతూ కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ మంత్రి వెళ్లిపోయారు. ఆయన వెంట పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాం రెడ్డి, టీజీఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ తదితరులు ఉన్నారు.

భక్త సమ్మేళనానికి పొంగులేటికి ఆహ్వానం

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28,29వ తేదీలలో మాధురి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే తెలుగు రాష్ట్రాల స్థాయి భక్త సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరు కావాలని రాష్ట్ర రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి నిర్వాహకులు ఆహ్వాన పత్రికలు అందించారు.

నేడు శ్రీమన్నారాయణాచార్యులకు బిరుదు ప్రదానం

భద్రాచలం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన శ్రీ అనంతాన్ పిళ్లై తిరుమల పీఠం అధ్యక్షుడు, సంస్కృత పండితుడు గుదిమెళ్ల శ్రీమన్నారాయణాచార్యులకు శుక్రవారం భద్రాద్రి విద్వత్శేఖర బిరుదును ప్రదానం చేయనున్నారు. భద్రాచలంలో శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతీ మహాస్వామి వారి ఆరాధనోత్సవాలు శుభం ఫంక్షన్ హాల్లో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణాచార్యులకు కామకోటి శిష్యకోటిచే ఈ బిరుదును ప్రదానం చేయడంతో పాటు పండిత సత్కారం నిర్వహించనున్నట్లు పురోహితులు ఆకెళ్ల శ్రీరామ్‌శర్మ తెలిపారు. చంద్రశేఖర సరస్వతీ మహాస్వామి వారి ఆరాధనోత్సవాల్లో భాగంగా విశేష అర్చన, పాదుకా పూజ, వేద స్వస్తి, మహా మంగళహారతి, ఛత్ర చామరాదులతో పలకి ఉత్సవం నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లమడ-బేతుపల్లి మధ్యలో గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుణ్ని 108 వాహనంలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. కాగా క్షతగాత్రుడి వివరాలు తెలియరాలేదు. కాగా ప్రమాదం కారణంగా భారీగా ట్రాఫిక్ నిలిచిపోగా పోలీసులు క్రమబద్ధీకరించారు.

సింగరేణి ప్రభావిత గ్రామాలను అభివృద్ధి చేస్తాం

» కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు



మొక్కను నాటి నీళ్లుపోస్తున్న జీఎం షాలెం రాజు

చుంచుపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రభావిత గ్రామాలను అభివృద్ధి చేస్తామని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజరు ఎం. షాలెం రాజు అన్నారు. గురువారం ఏరియా పరిధిలోని పెనగడప గ్రామంలో పండ్ల మొక్కల పంపిణీ చేసి మాట్లాడుతూ సింగరేణి సంస్థ ప్రభావిత గ్రామాలను అభివృద్ధిపర్చడంలో ఎల్లప్పుడు ముందుంటుందని, పర్యావరణాన్ని పరిరక్షించడం ముఖ్య బాధ్యతగా భావించి వివిధ రకాల మొక్కలను ప్లాంటేషన్ కార్యక్రమాలను నిర్వహిస్తుందని పేర్కొన్నారు. సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం ఇటీవల పర్యటనలో భాగంగా ప్రతి ఇంటికి కనీసం మూడుచెట్లు నాటాలని తెలియచేశారని తెలిపారు. ఆ ఆదేశానుసారం ఈ పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లుగా జీఎం తెలిపారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జే. గట్టయ్య, వైస్‌ప్రెసిడెంట్ ఎండి. రజాక్, ఎస్‌వోటు జీఎం జీవీ. కోటిరెడ్డి, ఫారెస్ట్రీ మేనేజరు డేవిడ్ అభిలాష్, ప్రాజెక్టు ఆఫీసర్ జీకేఓసీ ఎం. రమేష్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ ఎం. వెంకటేశ్వరరావు, ఎస్‌వోఎం ఎన్విరాల్‌మెంట్ తోట సత్యనారాయణ, మేనేజరు జీకేఓసీ ఎం. రామచంద్రమురళి, జీకేఓసీ ఎన్విరాల్‌మెంట్ ఆఫీసర్ వి. మధుకర్, సీనియర్ పీవో ఎం. మురళి పాల్గొన్నారు.

ధాన్యం అమ్మిన రైతులే.. డబ్బులివ్వాలట..!



» తూకంలో తేడా పేరుతో కొర్రీలు
» ధాన్యం డబ్బుల చెల్లింపునకు లంకె
» మిల్లర్ల తీరుతో అన్నదాతల ఇబ్బందులు
» నారాయణపురం సొసైటీ ద్వారా మిల్లులకు రెండు లారీల ధాన్యం

అశ్వారావుపేట రూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చేందుకు ధాన్యాన్ని అమ్మితే కొనుగోలు చేసిన అధికారులు, ధాన్యాన్ని దించుకున్న మిల్లర్ల వలన అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బస్తాకు అదనంగా అరకిలో పైగానే ధాన్యాన్ని తీసుకుంటున్న అధికారులు లారీని మిల్లులకు పంపిన తరువాత ధాన్యం తూకంలో తేడా వచ్చిందని, తేడా డబ్బులు చెల్లిస్తేనే నగదు జమ అవుతాయని తెలపటంతో రైతులు ఏమీ చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నారు.

అశ్వారావుపేట మండలంలోని నారాయణపురం సహకార సంఘం పరిధిలో దాదాపు 4వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. నారాయణపురం, గుమ్మడివల్లి సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈనెల 18న నారాయణపురం గ్రామానికి చెందిన 13 మంది రైతులకు చెందిన రెండు లారీల ధాన్యాన్ని జిల్లాలోని ఓ మండలంలో గల మిల్లుకు పంపారు. ఒక లారీలో 678 బస్తాలు, మరో లారీలో దాదాపు 576 బస్తాల ధాన్యాన్ని రవాణా చేశారు.

తీరా మిల్లుకు ధాన్యం చేరిన తరువాత ఒక లారీలో 4 క్వింటాలు, మరో లారీలో 6 క్వింటాలు తక్కువగా ధాన్యం వచ్చిందని, తక్కువగా వచ్చిన ధాన్యానికి సొమ్ము చెల్లిస్తేనే ధాన్యాన్ని దించుకున్నట్లు ఆన్‌లైన్ చేస్తామని మిల్లర్లు తెలిపారు. సాధారణంగా రెండు మూడు రోజుల తరువాత ధాన్యం నగదు జమ అవుతుంది. అయితే రైతులకు వారం అయినా నగదు జమ కాకపోవటంతో సహకార సంఘ కార్యాలయానికి వెళ్లి అధికారులను ప్రశ్నిస్తే మిల్లర్లు చెప్పిన విషయాన్ని చల్లగా చెప్పారు.

కేంద్రంలోనే కాటా వేసే సమయంలో తేడా వచ్చిందని, రైతులు నగదు చెల్లించాలని సూచించారు. మొదటి లారీకి ఒక్కో బస్తాకు రూ.13.65 చొప్పున 678 బస్తాలకు రూ.9280లను 8 మంది రైతులు, రెండో లారీలో వెళ్లిన ధాన్యం బస్తాకు రూ.23.20 చొప్పున మొత్తం 13,363లను ఐదుగురు రైతులు చెల్లించాలని సూచించారు. 13 మంది రైతులు అంతా కలిసి ఆనగదును ఇస్తే మిల్లుకు పంపుతామని అపుడే ధాన్యం చెల్లింపులు జరుగుతాయని అధికారులు కూడా చెప్పటంతో ఒక్కసారిగా కంగుతిన్నారు. సాధారణంగా బస్తాతో కలిపి 41.5 కిలోల ధాన్యం తీసుకుంటున్నారని, అయినా ఇపుడు తూకంలో తేడా అంటూ క్వింటాకు రెండు మూడు కిలోలు కోత పెట్టి రైతులను డబ్బులు కట్టమనటం భావ్యంగా లేదని రైతులు వాపోతున్నారు.

మిల్లర్ల తీరుతో ఇబ్బందులు

బండి రాము, రైతు



మా కుటుంబానికి చెందిన 139 బస్తాల ధాన్యాన్ని అధికారులు వారం క్రితం మిల్లుకు పంపారు. అమ్మిన ధాన్యానికి నగదు జమకాకపోవటంతో అధికారులను అడిగితే ధాన్య తూకంలో తేడా వచ్చిందని, అందుకు బస్తాకు రూ.23.20 చెల్లించాలని తెలిపారు. అంటే నేనే రూ.3225 నగదు తిరిగి మిల్లుకు కట్టాలని చెప్పారు. అసలు ఇది ఎక్కడి విడ్డూరమో అర్థం కాలేదు. ధాన్యం సొమ్ములు నాకు రూ.1.30లక్షల వరకు వస్తాయి. అయినా అప్పుల వాళ్ల పడలేక నగదు చెల్లించటానికి సిద్ధం అయ్యాను. అయితే అందరూ కడితేనే చెల్లింపులు అంటుండగా కొందరు నగదు చెల్లించటానికి ముందుకు రావటం లేదు.



28న బొమ్మలో మెగా జాబ్‌మేళా

ఖమ్మంఖానాపురంహవేలి డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని బొమ్మ కళాశాలలో ఈ నెల 28న మెగా జాబ్‌మేళా నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ బొమ్మా రాజేశ్వరరావు, వైస్ చైర్మన్ బొమ్మ సత్యప్రసాద్ తెలిపారు. 2020 నుంచి 2025 పాస్ అవుట్ విద్యార్థులు బీటెక్, బీఫార్మసీ, డిగ్రీ అర్హత ఉన్న విద్యార్థులు పాల్గోనవచ్చునని తెలిపారు. ఉదయం 10గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభమవుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు రెజ్యూమ్‌తోపాటు విద్యా అర్హత సర్టిఫికెట్ల జీరాక్స్‌లు, రెండు పాస్ పోటోలతో హాజరు కావాలని తెలిపారు.ఈ జాబ్ మేళాలో మొత్తం 16 కంపెనీల ప్రతినిధులు హాజరై క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	20 రూ.
వంకాయ	30
గుత్తి వంకాయ	38
బీరకాయ	38
పచ్చిమిర్చి	48
కాకరకాయ	48
బెండకాయ	24
పొట్లకాయ	38
దోసకాయ	30-38
చిక్కుడు	48
నాటుచిక్కుడు	68
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	24
దొండ	58-60
సొరకాయ	20
క్యారెట్	40
క్యాప్సికం	64
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	40-50
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	180
కొత్తిమీర కట్ట	25

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	ముఫాసా
శ్రీనివాస:	బచ్చలమల్లి
సాయిరాం:	విడుదల
కేపీఎస్:	పుష్ప 2
తిరుమల:	పుష్ప 2
సినీ గెలాక్సీ:	యూఐ

దుప్పట్లు పంపిణీ



మాట్లాడుతున్న ఎస్ఐ జగదీష్

తిరుమలాయపాలెం, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్లేడుగ్రామంలో మహిళలకు దుప్పట్లను ఎస్ఐ కూసుపుడి జగదీష్ గురువారం పంపిణీ చేశారు. ఖమ్మంరూరల్ మండలానికి చెందిన కాంగ్రెస్‌నాయకుడు భూక్యా సురేష్, తిరుమలాయపాలెం ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రతీఒక్కరు తోడ్పడాలన్నారు. సామాజిక రుగ్మతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.ఈకార్యక్రమంలో చర్చి పాస్టర్ రాజేష్, గండమాల సుందర్‌రావు, వెంకటనారాయణ,సంకీర్త్‌రెడ్డి పాల్గొన్నారు.

వానరానికి వైద్యసేవలు



వానరానికి చికిత్స చేయిస్తున్న అన్నం

ఖమ్మంఖానాపురంహవేలి డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వీడియోస్ కాలనీలో చెట్ల కింద గాయపడి నడవలేని స్థితిలో ఉన్న ఓ వానరానికి గురువారం అన్నం శ్రీనివాసరావు పశువైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. వానరానికి జ్వరం అధికంగా ఉందని కొన్ని రోజుల పాటు చికిత్స అవరం అని వైద్యులు చూచించటంతో ఆ వానరాన్ని నగరంలోని అన్నం ఫౌండేషన్‌కు తరలించారు. పాలు, పండ్లు ఆహారంగా అందిస్తున్నామని అన్నం శ్రీనివాసరావు తెలిపారు.

దాతలిచ్చినా.. గడపదాటనీయం!

- జిల్లా జనరల్ ఆస్పత్రికి ఆరు అంబులెన్స్‌ల విరాళం
- నిరుపయోగంగా ఉంచిన అధికారులు
- ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న రోగుల కుటుంబ సభ్యులు
- తాగునీటి శుద్ధి ప్లాంట్‌పైనా నిర్లక్ష్యమే..

ఆపదలో ఉన్న వారిని ఆదుకునే లక్ష్యంతో దాతలు కొంతమంది వాహనాలను సమకూర్చితే వాటిని నిర్వహించడానికి కూడా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. అలాగని ఆ వాహనాల అవసరం లేదని ఉందా అంటే అదేం లేదు.. ఎంతో మంది నిరుపేదలు ఆస్పత్రుల్లో చేరి ఉన్నత వైద్యం కోసం.. రిఫరల్ ఆస్పత్రులకు వెళ్లడానికి వేలాది రూపాయలను వెచ్చించి ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. ఉన్న వాహనాలను వినియోగించకుండా... నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు జిల్లా జనరల్ ఆస్పత్రి అధికారులు..



నిరుపయోగంగా అంబులెన్స్‌లు



మెడికల్ కళాశాలలో ఉంచిన వాహనం

ఖమ్మంకలెక్టరేట్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రిలో 108 వాహనాలు పెద్దవి మూడు, చిన్నవి మూడు వాహనాలున్నాయి. వీటిని దాతలు సమకూర్చారు. నిరుపేదలకు ఆపద సమయంలో గమ్యానికి చేర్చాలన్న లక్ష్యంతో పొంగులేటి శ్రీనివాసరెడ్డి , వీవీసీ ట్రస్ట్, హడ్కో నుంచి మూడు పెద్ద 108 వాహనాలు అందించారు. వీటితో పాటు స్వరాజ్ మెజ్దా, ఓమినీ వ్యానుతో పాటు ఇటీవలె యూబీఐ బ్యాంకు అధికారులు మినీ వ్యాన్‌ను 108గా అందించారు. ఈ మూడు వాహనాలు కనీసం నిర్వహణకు కూడా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. పాత వాహనాలకు డీజిల్ బకాయిలుగా రూ.90 వేలు ఉండడంతో కనీసం డీజిల్ పోయించి కూడా వినియోగించడానికి ఆసక్తిని చూపడంలేదు. దీంతో ఈ వాహనాలు ఆస్పత్రి షెడ్లలో నిరుపయోగంగా ఉంచారు. ఇటీవలె యూబీఐ అధికారులు ఇచ్చిన వాహనానికి లోపల బెడ్‌ను ఏర్పాటు చేయడానికి కూడా ఆస్పత్రి అధికారులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈ వాహనాన్ని బాక్సులు, ఇతర సామగ్రిని తరలించడానికి మాత్రమే వినియోగిస్తున్నారు. ఇక మెడికల్ కళాశాల వద్ద ఉన్న వీవీసీ ట్రస్ట్ అందించిన వాహనంలో అన్ని హంగులు ఉన్నప్పటికీ డీజిల్ పోయించ లేక ఆస్పత్రి అధికారులు చేతులెత్తేశారు. ఇక పెద్ద 108వాహనాలు షెడ్‌లోనే ఉంచారు. రోగులు డీజిల్ పోయించుకుని వెళ్తే తప్ప వాహనాలను రోగులకు అత్యవసర సమయంలో పంపించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రికి అదనపు ఆదాయంగా క్యాంటీన్, మెడికల్ స్టోర్, వాహనాల పార్కింగ్ నుంచి వచ్చే ఆస్కారం ఉంది. అలాంటి ఆదాయం నుంచి 108 వాహనాలకు డీజిల్ కు ఖర్చు చేస్తే వాటిని వినియోగంలోకి తీసుకురావడంతో పాటు నిరుపేదలకు కూడా అంబులెన్స్ సేవలు అందే ఆస్కారం ఉంటుందని భావిస్తున్నారు.

జిల్లాసుపత్రిలో ఇదీ తీరు

జిల్లాసుపత్రిలో పెరుగుతున్న మెరుగైన సేవలకు తగినట్లుగానే ఇక్కడి ఆస్పత్రికి పలు రకాల తోడ్పాటు దాతల నుంచి పుష్కలంగా అందుతోంది. ఏళ్ల తరబడి ఏదో ఒకరకమైన వస్తువును అందించడమనేది ఇక్కడ అనవాయితీగానే మారుతోంది. పలు స్వచ్ఛంద సంస్థలతోపాటు వ్యాపారులు ఇక్కడికి వచ్చే వారికి ఉపయుక్తమయ్యే ఉపకరణాల్ని అందిస్తూ వస్తున్నారు. ఇందులో కొందరు తాము చేసిన సాయం తెలవకూడదనేలా వాటిని ఇచ్చిన విషయాన్నే మర్చిపోతున్నారు. ఇలా చాలా రకాల వస్తువులు గడిచిన దశాబ్ద కాలంగా ఇక్కడి జిల్లాసుపత్రికి, ఎంసీహెచ్‌కు అందించారు.. ఇందులో ఏమేమి ఉన్నాయనే స్పష్టత ఉండటం లేదనేది ఆస్పత్రి వర్గాల నుంచి వినిపిస్తున్న మాట. స్టోర్ విషయమై రూమ్లో కొన్ని పదిలంగానే ఉన్నాయనే తీరు కనిపిస్తున్నా.. లోలోపల మాత్రం కొన్నింటి లెక్కాపత్రం లేనేలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆర్వోఫిల్టర్‌పైనా నిర్లక్ష్యం

దవాఖానకు వచ్చినవారి దాహార్తిని తీర్చేందుకు ఎంసీహెచ్‌లో లక్షల రూపాయలతో దాతలు ఏర్పాటు చేసిన తాగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటు చేశారు. నిత్యం వేలాది మంది. రోగులు వరకు సంబంధికుల దప్పిక తీర్చే ఈ యంత్రం వినియోగం విషయంలో ఏడాదిన్నర కాలంగా నిర్లక్ష్యమే కనిపిస్తోంది. చిన్నపాటి మరమ్మతులు చేయించకపోవడం, నిర్వహణ భారమనే సాకుతో దీని ఆలనను మన ఆస్పత్రి వర్గాలు మరిచిపోయారు. దీంతో దీని కోసం నిర్మించిన గదిసహా విలువైన ఉపకరణాలన్నీ వృదాగానే మారిపోయాయి. ఇటీవలె ఆర్వో ఫిల్టర్ వాటర్ మూలనపడింది. మంత్రి తనయుడు తుమ్మల యుగంధర్ ప్రత్యేక శ్రద్ధతో దానికి తిరిగి అందుబాటులోకి తీసుకొచ్చారు. తక్కువ ఖర్చుతో వాడుకలోకి వచ్చే వాటి విషయంలోనూ నిర్లిప్తత కనిపిస్తోంది. వీటిన్నింటి విషయమై పర్యవేక్షణ పెరిగి వినియోగించేలా మార్పు తెస్తే రోగులకు మంచి జరుగుతుంది. ఈ దిశగా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

రంగాకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న మున్నూరు కాపు సంఘం నేతలు

ఖమ్మంటౌన్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపుసంఘం రాష్ట్ర నాయకుడు వంగవీటి మోహన్‌రంగా వర్ధంతి గురువారం ఖమ్మంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మున్నూరు కాపు సంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ, కొత్తా సీతారాములు వేసి నివాళులు అర్పించారు. మున్నూరు కాపు భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నరాల నరేష్, యర్రా అప్పారావు, మదూరి సైదారావు, మాటేటి కిరణ్, రవి, జంగిలి రమణ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం నగర కార్పెంటర్స్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంటౌన్,డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): ఖమ్మం కార్పెంటర్స్ మేస్త్రీలు, వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం 2025 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. గౌరవ అధ్యక్షుడు దోసోజు లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు పాపాచారి, ప్రధాన కార్యదర్శి దిగజర్ల వెంకన్న, కోశాధికారి బైరోజు యాదగిరి, సైదాచారి, నర్సింహాచారి, గోవిందాచారి తదితరు కార్పెంటర్లు హాజరై క్యాలెండర్లను ఆవిష్కరించారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావులు

తిరుమలాయపాలెం, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో రహదారుల పక్కన ఉన్న వ్యవసాయబావులు ప్రమాదకరంగా మారాయి. ఏళ్లతరబడి రోడ్ల వెంబడి ఈబావులు అలాగే ఉన్నాయి. వీటికి రక్షణ గోడలు నిర్మించాల్సి ఉండగా పటిష్టంచుకునే నాధుడే కరువయ్యారు. మండలంలోని తిప్పారెడ్డిగూడెం, అజ్మీరతండా, బీరోలు, ఏనుకుంటతండా, రఘునాధపాలెం, హైదర్‌సాయిపేట, తదితర గ్రామాల్లో రహదారులకు పక్కన పాడుబడిన వ్యవసాయబావులున్నాయి. ఎవరైనా రాత్రివేళలో ఆదమరిచి ప్రయాణిస్తే ప్రమాదాలకు గురికావాల్సిన దుస్థితి నెలకొంది. అజ్మీరతండాలో రోడ్డుపక్కన పాత వ్యవసాయ బావి ఉంది. అటునుంచిపిల్లలు పాఠశాలకు వెళ్లి వస్తుంటారు. ఈబావికి ఎలంటి రక్షణ గోడలేదు. దీంతో ఆప్రాంతవాసులు తీవ్రఆందోళన పడుతున్నారు. అలాగే ఖమ్మం-వరంగల్ రహదారి తెట్టలపాడు క్రాస్ రోడ్డు వద్ద పెద్ద వ్యవసాయబావి ఉంది. దీనికి రక్షణ గోడలేదు. ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టలేదు. తాత్కాలికంగా హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసినా ఫలితం లేకుండాపోయింది. నిత్యంఈరహదారిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళలో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణనష్టం జరిగే అవకాశంఉంది. అధికారులు రక్షణ ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.



తెట్టెలపాడు క్రాస్‌రోడ్డు వద్ద రోడ్డుపక్కన ఉన్న వ్యవసాయబావి

నెరవేరనున్న 10 గ్రామాల ప్రజల కల

- లింగాలలో 33/ 11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం మంజూరు
- ఉపకేంద్రం ఏర్పాటుతో పలు గ్రామాలకు తొలగనున్న విద్యుత్ సమస్యలు



లింగాలలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పనుల ప్రారంభానికి వేసిన శిలాఫలకం

కల్లూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని లింగాల పరిసర గ్రామాలకు అనుసంధానంగా నూతనంగా 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం మంజూరైంది. గత అనేక సంత్సరాల నుంచి లింగాలలో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు ప్రజలు ఎదురు చూపులు చూస్తుండగా, ఉన్నత అధికారులు ఎట్టకేలకు ఈ కేంద్రాన్ని మంజూరు చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో త్వరలో లింగాల ఈ విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు సంబంధిత అధికారుల సన్నాహాలు చేస్తున్నారు. మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌తో పాటుగా తల్లాడ మండలంలోని మిట్టపల్లిలో గల ఉప కేంద్రం ద్వారా లింగాల, చెన్నూరు, ముచ్చవరం, యజ్ఞనారాయణపురం, పాయపూరు, ఓబుల్‌రావుబంజర, విశ్వానాథపురం, సత్యనారాయణపురం, పాత యర్రబోయిపల్లి, కొత్త ఎర్రబోయనపల్లి గ్రామాలను విద్యుత్ సరఫరా జరిగేది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇబ్బందులు పడ్డారు.

తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగేది. వ్యవసాయ విద్యుత్ మోటార్లు కూడా లోఓల్టేజితో కాలిపోయేవి. ఇలా గృహ వినియోగదారులు, రైతులు నానా అవస్థలు పడ్డారు. ఈ పరిస్థితిపై ఆయా గ్రామాల ప్రజలు అనేక సందర్భాలలో ప్రభుత్వ పాలకుల, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి లింగాల గ్రామానికి చెందిన గోపిశెట్టి శేష మ్మ, నరిసింహారావు దంపతుల పేరు మీదుగా ఉన్న 0.18 కుంటల స్థలాన్ని వితరణ చేశారు. లింగాల గ్రామంలో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుతో పది గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ కేంద్రం మంజూరుకు సహకరించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లకు ఈ ప్రాంతానికి చెందిన రైతులు నలజాల మంగపతిరావు, మండల కాంగ్రెస్ నాయకులు దేవరపల్లి వెంకటేశ్వరరావు, తక్కేళ్లపాటి ప్రసాద్, మద్దినేని లోకేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఈ ఉపకేంద్రం నిర్మాణ పనులను చేపట్టేందుకు సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి శంకుస్థాపన రానున్నారని సంబంధిత అధికారులు తెలిపారు.

నాయకుల త్యాగాలే పార్టీని ఉన్నత శిఖరాన నిలిపాయి

- సీపీఐ నేలకొండపల్లి మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్
- ఘనంగా శతవసంత వేడుకలు

నేలకొండపల్లి, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి)శక్తివంతమైన నాయకులు, వారుచేసిన త్యాగాలే కమ్యూనిస్టు పార్టీని ఉన్నత శిఖరాన నిలిపాయని సీపీఐ మండల కార్యదర్శి, జిల్లా నాయకుడు కర్నాటి భానుప్రసాద్ పేర్కొన్నారు. పార్టీ శతవసంతాల నేపథ్యంలో నిర్మించిన నూతన దిమ్మెను, అరుణ పతాకాన్ని కర్నాటి ఆవిష్కరించారు. ప్రజల కొరకు సర్వం త్యాగం చేసి పోరాడిన త్యాగధనుల కాణాచి కమ్యూనిస్టు పార్టీ అన్నారు. పార్టీకి పురోగమనమే తప్ప తిరోగమనం లేదన్నారు. ఎర్రజెండా పేదలకు ధైర్యానిచ్చిందని పేదల పక్షాన పోరాడిందన్నారు. అనేక చారిత్రక విజయాలను సాధించిందన్నారు. అనంతరం కర్నాటి కృష్ణయ్య భవన్ వద్ద రైతు సంఘం నాయకుడు కాశిబోయిన అయోధ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కనకబండి సీతారాములు, సీపీఎం మండల నాయకుడు పగిడికత్తుల నాగేశ్వరరావు,నాయకులు నంబూరి నారాయణ, చావా గణపతిరావు, మారిశెట్టి వెంకటేశ్వర్లు, వల్లాల కృష్ణ, మహేశ్వర అప్పారావు, కర్నాటి నళిని, రాజేశ్వరి, సీఐటీయూ మండల నాయకుడు గండారపు రామారావు, కొల్లి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.





నేలకొండపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న భానుప్రసాద్, రూరల్‌లో కేక్ కట్ చేస్తున్న సురేష్

ఘనంగా శతవసంత వేడుకలు

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో సీపీఐ శతవసంత వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వరంగల్ క్రాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సీపీఐ గద్దెను సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, వెంపటి చిన్న కృష్ణమూర్తి ఆవిష్కరించారు. నాయకుల త్యాగాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్త సమ్మేళనానికి రూ.25వేల విరాళం

సత్తుపల్లి, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో ఈనెల 28, 29వ తేదీలలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే రామకృష్ణ-వివేకానంద భావ ప్రచార పరిషత్ భక్త సమ్మేళనానికి రూ25వేలు చెక్కును బుధవారం విరాళంగా అందజేశారు. స్థానిక శారద రెసిడెన్సీ, రామకృష్ణ యోగానమితి సంయుక్త ఆధ్వర్యంలో చల్లగుళ్ల అప్పారావు ద్వారా చెక్కును సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి చేతులమీదుగా నిర్వాహకులు చీకటి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

బోనకల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబీరవల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన తొర్లపాటి ఏసు కుటుంబానికి గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సండ్ర శ్రీనివాసరావు రూ. 6వేల నగదును వితరణగా అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాటకొండ రమేష్, బంగారు రాజు, తొర్లపాటి అశోక్, పిల్లి రాహుల్, కొప్పుల సామేలు, మెట్టెల నర్సింహారావు, జయరాజు, సుందరరావు, వెంకటరత్నం, లక్ష్మణరావు, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పెనుబల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య లంకాసాగర్ గ్రామానికి చెందిన నరెడ్ల రఘుపతిరెడ్డికి గురువారం అందజేశారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మందడపు అశోక్‌కుమార్‌పాల్గొన్నారు.

గీతామందిరంలో పంచామృత అభిషేకాలు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ గీతజ్ఞాన మందిరంలో గురువారం సుదర్శన ఆళ్వార్ (చక్రఆళ్వార్)కు పంచామృత అభిషేకాలు, శ్రీలక్ష్మీనృసింహ, సుదర్శన హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తూరు రాజేశ్వరరావు, బాల లీలాకృష్ణ, ఏపూరు పురుషోత్తం, తాటికొండ వెంకటేశ్వరరావు, కొనకళ్ల శంకరరావు, వనమా నరేష్, నాగారపు సుబ్బారావు పాల్గొన్నారు.



షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

వేంసూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం మర్లపాడులో శ్రీషిరిడీ సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు బూర్గుల పవన్‌కుమార్‌శాస్త్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పదివేల మంది భక్తులు పాల్గొన్నారు.



స్థానిక పోరు కోసం ఆశావహుల తహతహ

- ఓటర్ల ప్రసన్నం కోసం మంతనాలు
- వ్యక్తిగత పరిచయాలతో పావులు...
- రిజర్వేషన్ పైనే ఆశలు!



బోనకల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పోరు కోసం గ్రామాల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు గానూ ఆశావహులు తహతహలాడుతున్నారు. ఇప్పటికే వార్డుల విభజన పూర్తి కావడంతో పాటు జాబితాలు ప్రదర్శిస్తుండటంతో పల్లెల్లో రాజకీయ వేడి రాజుకుంటుంది. ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కావాలని ఆశిస్తున్న వారు తమ అదృష్టాన్ని పరిక్షించుకునేందుకు మంతనాలు జరుపుతున్నారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా అన్నింటికంటే మండల కేంద్రమైన బోనకల్ పంచాయతీ సీటు చాలా హాట్ గురూ అంటూ ప్రజల్లో ప్రత్యేకమైన చర్చ జరుగుతుంది. ఈ గ్రామ పంచాయతీలో ఓటర్లు విలక్షణమైన తీర్పు ఇవ్వడంలో దిట్ట. గ్రామంలో 3,780 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా తటస్థ ఓటర్లు ఈ గ్రామంలోనే ఉన్నట్లు చర్చ జరుగుతుంది. ఎన్నిక ఏదైనా ఓటుకు నోటు ఎన్నికల తీర్పులో తీవ్ర ప్రభావం చూపడంతో పాటు వ్యక్తిని బట్టి కూడా కొంతమేరకు ఓట్ల బదలాయింపు జరుగుతుంది. వరుసగా మూడు పర్యాయాలు ఎస్సీ, జనరల్, ఎస్టీ కేటగిరిలకు చెందిన వారు సర్పంచ్‌లుగా పని చేశారు. ప్రభుత్వం తాజాగా బీసీ కులగణన సర్వే నిర్వహించి వారికి రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించడంతో బీసీ కేటగిరి అభ్యర్థుల్లో సర్పంచ్ స్థానం పై ఆశలు చిగురించాయి. దీంతో దాదాపు అర డజను మంది సర్పంచ్ రేసులో తామున్నామని ప్రజల్లోకి వెళ్తున్నారు. కులాల వారీగా లెక్కలు వేసుకుంటూ ముఖ్యులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు అవసరమైతే ఎంత ఖర్చైనా తగ్గేదేలే అంటూ సర్పంచ్ సీటు కోసం పోటీ పడుతున్నారు. వ్యక్తిగత పరిచయాలతో పావులు కదుపుతూ ముందుకెళ్తున్నారు. రిజర్వేషన్ల ప్రకటన కోసం ఆతృతతో ఎంతగానో ఎదురు చూస్తున్నారు. మండలంలో ముష్టికుంట్ల, రావినూతల గ్రామాలు కూడా మేజర్ పంచాయతీలు కావడంతో ఆశావహులు పావులు కదుపుతుండటంతో స్థానిక పోరు ముందుగానే మొదలైనట్లు చర్చ జరుగుతుంది. రిజర్వేషన్లు ప్రకటిస్తే గాని అసలు రాజకీయం ఆరంభం కానుందని మండల వ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారు.

28న సత్తుపల్లిలో
మంత్రి తుమ్మల పర్యటన

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలంలో ఈనెల 28వ తేదీన శనివారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, కో-ఆపరేషన్, జౌళీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా బుగ్గపాడు నుంచి నాగుపల్లి వరకు ఆర్అండ్‌బీ రహదారి నిర్మాణం, కాకర్లపల్లిలో బీటీ రోడ్డు సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. అదే విధంగా నూతనంగా నిర్మించిన కో-ఆపరేటీవ్ సొసైటీ భవనాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం తల్లాడ మండలం నూతనకల్‌లో జరిగే కార్యక్రమానికి వెళ్లనున్నారు.

నేడు బెటాలియన్‌లో శిక్షణ సిబ్బంది
పాసింగ్ అవుట్ పరేడ్

సత్తుపల్లిరూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గంగారం 15వ ప్రత్యేక బెటాలియన్‌లో శిక్షణ పొందిన సిబ్బంది పాసింగ్ అవుట్ పరేడ్ కార్యక్రమానికి ఖమ్మం సీపీ సునీల్‌దత్ శుక్రవారం రానున్నారు. టీఎస్‌పీ ఎస్‌సీటీ పీసీల 2024బ్యాచ్ దీక్షాంత్ పరేడ్‌లో పాల్గొని ప్రసంగించనున్నారు.

నెరవేరనున్న
10 గ్రామాల ప్రజల కల

» లింగాలలో 33/ 11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం మంజూరు

» ఉపకేంద్రం ఏర్పాటుతో పలు గ్రామాలకు తొలగనున్న విద్యుత్ సమస్యలు



లింగాలలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పనుల ప్రారంభానికి వేసిన శిలాఫలకం

కల్లూరు, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని లింగాల పరిసర గ్రామాలకు అనుసంధానంగా నూతనంగా 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం మంజూరైంది. గత అనేక సంత్సరాల నుంచి లింగాలలో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు ప్రజలు ఎదురు చూపులు చూస్తుండగా, ఉన్నత అధికారులు ఎట్టకేలకు ఈ కేంద్రాన్ని మంజూరు చేస్తూ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో త్వరలో లింగాల ఈ విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు సంబంధిత అధికారుల సన్నాహాలు చేస్తున్నారు. మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌తో పాటుగా తల్లాడ మండలంలోని మిట్టపల్లిలో గల ఉప కేంద్రం ద్వారా లింగాల, చెన్నూరు, ముచ్చవరం, యజ్ఞనారాయణపురం, పాయపూరు, ఓబుల్‌రావుబంజర, విశ్వానాథపురం, సత్యనారాయణపురం, పాత యర్రబోయిపల్లి, కొత్త ఎర్రబోయనపల్లి గ్రామాలను విద్యుత్ సరఫరా జరిగేది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ఇబ్బందులు పడ్డారు.

తరచుగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగేది. వ్యవసాయ విద్యుత్ మోటార్లు కూడా లోఓల్టేజితో కాలిపోయేవి. ఇలా గృహ వినియోగదారులు, రైతులు నానా అసవస్థలు పడ్డారు. ఈ పరిస్థితిపై ఆయా గ్రామాల ప్రజలు అనేక సందర్భాలలో ప్రభుత్వ పాలకుల, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ సబ్‌స్టేషన్ నిర్మాణానికి లింగాల గ్రామానికి చెందిన గోపిశెట్టి శేష మ్మ, నరిసింహారావు దంపతుల పేరు మీదుగా ఉన్న 0.18 కుంటల స్థలాన్ని వితరణ చేశారు. లింగాల గ్రామంలో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుతో పది గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఈ కేంద్రం మంజూరుకు సహకరించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌లకు ఈ ప్రాంతానికి చెందిన రైతులు నలజాల మంగపతిరావు, మండల కాంగ్రెస్ నాయకులు దేవరపల్లి వెంకటేశ్వరరావు, తక్కెళ్లపాటి ప్రసాద్, మద్దినేని లోకేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ఈ ఉపకేంద్రం నిర్మాణ పనులను చేపట్టేందుకు సత్తుపల్లి శాసన సభ్యురాలు మట్టా రాగమయి శంకుస్థాపన రానున్నారని సంబంధిత అధికారులు తెలిపారు.

భక్త సమ్మేళనానికి రూ.25వేల విరాళం అందజేత



ఎమ్మెల్యే రాగమయి చేతుల మీదుగా చెక్కు అందిస్తున్న అప్పారావు

సత్తుపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలో ఈనెల 28, 29వ తేదీలలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే రామకృష్ణ-వివేకానంద భావ ప్రచార పరిషత్ భక్త సమ్మేళనానికి రూ.25వేలు చెక్కును బుధవారం విరాళంగా అందజేశారు. స్థానిక శారద రెసిడెన్సీ రామకృష్ణ యోగానమితి సంయుక్త ఆధ్వర్యంలో చల్లగుళ్ల అప్పారావు ద్వారా చెక్కును సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి చేతులమీదుగా నిర్వాహకులు చీకటి శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు ఉన్నారు.

'వైరాలో అరుణోదయ సభను విజయవంతం చేయండి'



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

వైరా, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఈనెల 31న నిర్వహించే 50ఏళ్ల అరుణోదయ సభ, ప్రదర్శనను జయప్రదం చేయాలని అరుణోదయ సంస్థ నాయకులు కోరారు. వైరాలో గురువారం అరుణోదయ సభ, ప్రదర్శన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అరుణోదయ 50సంవత్సరాల్లో కష్టజీవుల పక్షాన నిలిచిందని, కార్మిక, రైతాంగ, మహిళా, మైనార్టీ, దళిత, ఆదివాసీల పక్షాన నిలిచిన హక్కుల రక్షణ కోసం సాగిన పోరాటాల్లో గజ్జ కట్టి గళం విప్పి కళారూపాలను ప్రదర్శించిందన్నారు. 31న వైరాలో కళాకారుల ప్రదర్శన, గాంధీ సెంటర్లో బహిరంగ సభ నిర్వహిస్తామని అరుణోదయ సంస్థ ఖమ్మం జిల్లా కార్యదర్శి గడ్డం లక్ష్మణ్ తెలిపారు. ప్రొఫెసర్ వినయ్‌బాబు, గాయకులు యశపాల్, అజ్మీరా బిచ్చా, కృష్ణ, బొర్రా రాఘవులు, వాసం బుచ్చిరాజు, యోగానందం, సీవై.పుల్లయ్య, కె.అర్జున్‌రావు, జి.రామయ్య, టి.ఝాన్సీ, ఆవుల మంగతాయి తదితరులు ప్రసంగిస్తారని తెలిపారు.

నాలుగేళ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తాం

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పెనుబల్లిలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పెనుబల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా రానున్న నాలుగేళ్లలో 20లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం పెనుబల్లిలో ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.29లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయిదయానంద్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో పొంగులేటి మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లలో 1.25లక్షల ఇళ్లు నిర్మిస్తే ఇందిరమ్మ రాజ్యంలో నాలుగేళ్లలో 20లక్షల చొప్పున ఇళ్లు నిర్మిస్తామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3500 కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. పాలేరుతోపాటు సత్తుపల్లి నియోజకవర్గాలకు ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేనప్పటికీ రైతు రుణమాఫీ చేయడంతో పాటు ధాన్యాన్ని కొనుగోలు చేసి బోనస్‌ను రైతులకు అందజేయటం జరిగిందన్నారు. ముందుగా ఇచ్చిన మాట ప్రకారమే ధరణిని బంగాళాఖాతంలో వేసి భూభారతి 2024 తీసుకువచ్చామని తద్వారా ప్రతి గ్రామంలోని రైతుల భూసమస్యలను తీర్చటం జరుగుతుందని పేర్కొన్నారు.

పెనుబల్లికి వరాల జల్లు...

పెనుబల్లి గ్రామపంచాయతీని నగర పంచాయతీగా మార్పు చేస్తామని, పెనుబల్లి ప్రధాన రహదారికి డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, అసంపూర్తిగా ఉన్న ప్రెస్‌క్లబ్ నిర్మాణాన్ని పూర్తిచేయిస్తానని తదితర సమస్యల పరిష్కారానికి హామీలిచ్చారు. ఈ సందర్భంగా పెనుబల్లి మండలంలోని 105మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఆర్డీవో రాజేంద్రగౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ విజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజా ప్రభాకర్ చౌదరి, వైస్‌చైర్మన్ వాకదాని కోటేశ్వరరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకుడు వంకాయలపాటి వెంకటేశ్వరరావు, నాయకులు చీకటి రామారావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, బొర్రా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కల్లూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కల్లూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాయపూరులో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం రూ.2 కోట్ల అంచనాతో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ త్వరగా ఈ రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయబాబు, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి, కాంగ్రెస్ నాయకులు, హరిబాబు, ఊటుకూరు సందీప్, గణేష్ చౌదరి, భుక్యా శివకుమార్‌నాయక్, ఎస్‌కే ఉస్మాన్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు మంత్రి పొంగులేటి పరామర్శ...

మండల పరిధిలోని పాయపూరు, నారాయణపురం గ్రామాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పలు కుటుంబాలను పరామర్శించారు. పాయపూరులో ఇటీవల కాలంలో మృతి చెందిన మాజీ సర్పంచ్ ఊటుకూరు చంద్రశేఖర్‌శర్మ, కొంగర కోటయ్యల కుటుంబాలను పరామర్శించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులు ఊటుకూరు సందీప్, కొంగర సరస్వతి, యేపూరి గణేష్‌లకు సానుభూతి సంతాపం తెలిపారు. నారాయణపురంలో ఇటీవల అనారోగ్యానికి గురైన మాజీ సర్పంచ్ అంకిరెడ్డి కనకదుర్గలను పరామర్శించారు.

తల్లాడలో....

తల్లాడ, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబేద్కర్‌నగర్-పినపాక బీటీ రోడ్డు నిర్మాణానికి గురువారం రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన చేశారు. అంబేద్కర్ నగర్-పినపాక రెండు కిలోమీటర్ల మేరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.రెండుకోట్లు మంజూరయ్యాయి. పినపాకలో గుర్రం శ్రీనివాసరావు గృహంలో జరిగిన తేనేటి విందులో మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీ ఆర్.రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మట్టా దయానంద్, సొసైటీ చైర్మన్ దిరిశాల నర్సింహారావు, కాపా సుధాకర్, గోపిశెట్టి వెంకటేశ్వర్లు, కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ), నారపోగు వెంకట్, గుర్రం శ్రీనివాసరావు, గణేశుల రవి, పాల్గొన్నారు.



కల్లూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి

గీతామందిరంలో పంచామృత అభిషేకాలు



గీతామందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

సత్తుపల్లిరూరల్, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ గీతజ్ఞానమందిరంలో గురువారం సుదర్శన ఆళ్వార్ (చక్ర ఆళ్వార్)కు పంచామృత అభిషేకాలు, శ్రీ లక్ష్మీ నృసింహ, సుదర్శన హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞాచార్యులు శ్రీమాన్ తిరుమలాచార్యులు, అర్చకస్వామి అమరవాది కృష్ణచైతన్యచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు సాగాయి. కార్యక్రమంలో కొత్తూరు రాజేశ్వరరావు, బాల లీలాకృష్ణ, ఏపూరు పురుషోత్తం, తాటికొండ వెంకటేశ్వరరావు, కొనకళ్ల శంకరరావు, వనమా నరేష్, నాగారపు సుబ్బారావు, సత్యవతి, పుష్పావతి, శారద, సీత, లక్ష్మీ, రత్నకుమారి, విజయ, ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

వేంసూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం మర్లపాడులో షిర్డీ సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు బూర్గుల పవన్‌కుమార్‌శాస్త్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కోలాటం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో పదివేల మంది భక్తులు పాల్గొన్నారు.

మాజీమంత్రి శీలం సిద్ధారెడ్డి వర్ధంతి



సిద్ధారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఎర్రుపాలెం, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా తొలి మంత్రి శీలం సిద్ధారెడ్డి 13వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈసందర్భగా గ్రామ చౌరస్తాలో ఉన్న శీలం సిద్ధారెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా తొలిమంత్రిగా ఆయన సేవలను కొనియాడారు. తొలినాళ్లలో కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపంచడంలో, ఢిల్లీలో పార్టీ అధిష్టానం వద్ద చెరగని ముద్ర వేసుకుని జిల్లాకు నిధులు రాబట్టారన్నారు. మధిర నియోజకవర్గంలో రైతుల కోసం ఆయన చేపట్టిన సంస్కరణలు స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, డీసీసీటీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యన్నం పిచ్చిరెడ్డి, అనుమోలు కృష్ణారావు, తల్లపురెడ్డి నాగిరెడ్డి, దేవరకొండ రాజీవ్‌గాంధీ, గూడేటి బాబురావు, సొసైటీ అధ్యక్షుడు శీలం అక్కిరెడ్డి, యన్నం సత్యనారాయణరెడ్డి, మొగిలి అప్పారావు, వేమిరెడ్డి వెంకటరెడ్డి, స్వాతంత్రసమరయోధురాలు శెట్టిపల్లి సరోజిని, బొగ్గుల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరు కోసం ఆశావహుల తహతహ

» ఓటర్ల ప్రసన్నం కోసం మంతనాలు

» వ్యక్తిగత పరిచయాలతో పావులు...

» రిజర్వేషన్ పైనే ఆశలు!



బోనకల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక పోరు కోసం గ్రామాల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకుగానూ ఆశావహులు తహతహలాడుతున్నారు. ఇప్పటికి వార్డుల విభజన పూర్తి కావడంతో పాటు జాబితాలు ప్రదర్శిస్తుండటంతో పల్లెల్లో రాజకీయ వేడి రాజుకుంటుంది. ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కావాలని ఆశిస్తున్న వారు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు మంతనాలు జరుపుతున్నారు. మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉండగా అన్నింటికంటే మండల కేంద్రమైన బోనకల్ పంచాయతీ సీటు చాలా హాట్ గురూ అంటూ ప్రజల్లో ప్రత్యేకమైన చర్చ జరుగుతుంది. ఈ గ్రామ పంచాయతీలో ఓటర్లు విలక్షణమైన తీర్పు ఇవ్వడంలో దిట్ట. గ్రామంలో 3,780 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధికంగా తటస్థ ఓటర్లు ఈ గ్రామంలోనే ఉన్నట్లు చర్చ జరుగుతుంది. ఎన్నిక ఏదైనా ఓటుకు నోటు ఎన్నికల తీర్పులో తీవ్ర ప్రభావం చూపడంతో పాటు వ్యక్తిని బట్టి కూడా కొంతమేరకు ఓట్ల బదలాయింపు జరుగుతుంది. వరుసగా మూడు పర్యాయాలు ఎస్సీ, జనరల్, ఎస్టీ కేటగిరిలకు చెందిన వారు సర్పంచ్‌లుగా పని చేశారు. ప్రభుత్వం తాజాగా బీసీ కులగణన సర్వే నిర్వహించి వారికి రిజర్వేషన్లు పెంచుతామని ప్రకటించడంతో బీసీ కేటగిరి అభ్యర్థుల్లో సర్పంచ్ స్థానం పై ఆశలు చిగురించాయి. దీంతో దాదాపు అర డజను మంది సర్పంచ్ రేసులో తామున్నామని ప్రజల్లోకి వెళ్తున్నారు. కులాల వారీగా లెక్కలు వేసుకుంటూ ముఖ్యులను ప్రసన్నం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు అవసరమైతే ఎంత ఖర్చైనా తగ్గేదేలే అంటూ సర్పంచ్ సీటు కోసం పోటీ పడుతున్నారు. వ్యక్తిగత పరిచయాలతో పావులు కదుపుతూ ముందుకెళ్తున్నారు. రిజర్వేషన్ల ప్రకటన కోసం ఆతృతతో ఎంతగానో ఎదురు చూస్తున్నారు. మండలంలో ముష్టికుంట్ల, రావినూతల గ్రామాలు కూడా మేజర్ పంచాయతీలు కావడంతో ఆశావహులు పావులు కదుపుతుండటంతో స్థానిక పోరు ముందుగానే మొదలైనట్లు చర్చ జరుగుతుంది. రిజర్వేషన్లు ప్రకటిస్తే గాని అసలు రాజకీయం ఆరంభం కానుందని మండల వ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారు.

రామాలయ నిర్మాణానికి భూమిపూజ



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న అర్చకులు

ఏన్కూరు, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి): బురదరాఘవాపురం గ్రామంలో గురువారం నూతన రామాలయం నిర్మాణ భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆలయ ని ర్మాణానికి గోదావరి, కృష్ణ, రామేశ్వరం, కన్యాకుమారి, శబరిమల సన్నిధానం, మూడు స ముద్రాల నుంచి మట్టి, ఇసుక నీటిని సేకరించారు. గ్రామంలోని నలుదిక్కుల నుంచి మట్టి, ఇసుక, నీటిని సేకరించి గర్భగుడి ప్రతిష్ఠింపజేశారు. అనంతరం అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆల యకమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న సండ్ర

పెనుబల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు సహకారంతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య లంకాసాగర్ గ్రామానికి చెందిన నరెడ్ల రఘుపతిరెడ్డికి గురువారం అందజేశారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో మందడపు అశోక్‌కుమార్, తుమ్మలపల్లి రమేష్, పడిగడుపు రాములు తదితరులు పాల్గొన్నారు.

వందేళ్ల సీపీఐ చరిత్ర యువతకు ఆదర్శం

» సీపీఐ జిల్లా నాయకుడు దొండపాటి రమేష్

కొణిజర్ల, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం, భుక్తి కోసం సమ సమాజస్థాపన కోసం సాగిన సుదీర్ఘ పోరాటంలో సీపీఐ వందేళ్ల చరిత్ర నేటి యువతకు ఆదర్శంగా నిలిచిందని సీపీఐ జిల్లా నాయకుడు దొండపాటి రమేష్ తెలిపారు. గురువారం మండలంలోని తనికెళ్ల, కొణిజర్ల గ్రామాలలో సీపీఐ శతజయంతి ఉత్సవాలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కొణిజర్లలో దొండపాటి మాట్లాడుతూ రైతులు కార్మికులు ప్రయోజనాలను దెబ్బతీసేందుకు కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా పరిపాలన సాగిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గడ్డం లక్ష్మయ్య, స్వర్ణ రమేష్, పీవిరావు, యాసా వెంకటేశ్వరరావు, గడల భాస్కర్, తండు సోమయ్య, గొడ్డుగర్ల శ్రీను, ఎర్ర శ్రీను, సీతరాములు, యాసా వెంకటేశ్వరరావు, ఏసు, వీరయ్య, రత్నం తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ సీనియర్ నాయకుడు లక్ష్మయ్య

ముగిసిన అయ్యప్పస్వామి మండల పూజలు



కలశాలతో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మధిర, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి): మధిరలోని శ్రీఅయ్యప్పస్వామి దేవాలయంలో గత నెల 16న ప్రారంభమైన 17వ వార్షిక మండల పూజలు గురువారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు అయ్యప్పస్వామికి విశేష పూజలు నిర్వహించారు. కలశాలతో హోమం పూజలు, 18రకాల ద్రవ్యాలతో అభిషేకపూజలు, శివేలీప్రదర్శన నిర్వహించారు. మాలదారులకు కార్తీక మాసం ప్రారంభం నుంచి 55రోజులపాటు అన్నవితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. అలాగే నవంబరు27 వతేదీ నుంచి డిసెంబరు 4వతేదీ వరకు స్వామి వారి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పల్లివేట, అరట్టు నదీస్నానం, చక్రవాకం కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. చివరి రోజు ముగింపు కార్యక్రమాల్లో వివిధ సేవలందించిన భక్తులకు ఆలయకమిటీ సేవా పురస్కారాలను అందజేసింది. ఈ కార్యక్రమంలో కేరళ అర్చకులు శబరి దినేష్, దేవాలయ అర్చకులు దేవంభట్ల కుమారస్వామి, మధుస్వామి, ఆలయ నిర్వాహకులు చలువాది ధర్మారావు, చలువాది శ్రీనివాసరావు, దేవిశెట్టి రంగారావు, గురుస్వాములు వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, బత్తుల శ్రీనివాసరావు, చెరుపల్లి శ్రీధర్, పసుపులేటి శ్రీనివాసరావు, పాసికంటి గాంధీ, కుందా పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా ఆశయాలు సాధించాలి



మోహన్‌రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వైరా, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వైరాలో గురువారం వంగవీటి మోహన్‌రంగా 36వ వర్ధంతిని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మునిసిపల్ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, నాయకులు కట్ల రంగారావు, కట్ల శ్రీకాంత్, ముదిగొండ్ల మహేష్‌బాబు, మాదినేని రాంనారాయణ, రేచర్ల వెంకటేష్, పుల్లయ్య, సీతరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బోనకల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నబీరవల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన తొర్లపాటి ఏసు కుటుంబానికి గురువారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సండ్ర శ్రీనివాసరావు రూ.6వేల నగదును వితరణగా అందజేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాటకొండ రమేష్, బంగారు రాజు, తొర్లపాటి అశోక్, పిల్లి రాహుల్, కొప్పుల సామేలు, మెట్టెల నర్సింహారావు, జయరాజు, సుందరరావు, వెంకటరత్నం, లక్ష్మణరావు, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.